ఆదివారం
ప్రజాశక్తి
ఫిబ్రవరి 22, 2004



మతతత్వం, మార్కెటింగ్‌ల
మేడిపండు బిజెపి



హ్యాపీ బర్త్‌డే

(22-2-2004 నుండి 28-2-2004వరకు)

పి. కీర్తి
2సం॥, 22.2.2002
దుర్గాభవాని-దుర్గారావు
తాడేపల్లి-గుంటూరు

రోహన్-రోషన్
1సం॥, 22.2.2003
రజిత-మోహన్
వైరా-ఖమ్మం

శఫాఉన్నీసా
2సం॥, 23.2.2002
రహీనబేగం-శఫీయోద్దీన్
కుప్పనగర్-మెదక్

ఎ. జ్లిసి
2సం॥, 23.2.2002
దీవనమ్మ-అంజనేయులు
శాంతినగర్-అనంతపురం

సింధు
6సం॥, 24.2.1998
సుజాత-ఆనంద్
అమరచింత-మ॥నగర్

కె. అశ్విత
1సం॥, 26.2.2003
లక్ష్మి-శ్రీనివాసులు
తొగర్‌పల్లి-మెదక్

భరత్‌కుమార్
6సం॥, 26.2.1998
శ్రీదేవి-బొందయ్య
కల్వకుర్తి-మ॥నగర్

కౌసల్య
3సం॥, 27.2.2001
సౌజన్య-సురేంద్రనాథ
యడ్లపాడు-గుంటూరు

కె. సాయినాథరెడ్డి
7సం॥, 28.2.1997
మీన-సోమిరెడ్డి
నకిరేకల్-నల్లగొండ

నాగటి అక్షర
1సం॥, ఫిబ్రవరి-2003
అరుణ-యాదయ్య
ధర్మన్నగూడ-రంగారెడ్డి

వై. మురారి చౌదరి
1సం॥, ఫిబ్రవరి-2003
లావణ్య-నరసింహారెడ్డి
అలంపూర్-మ॥నగర్



డి. మన్మధరెడ్డి(చిన్ను)
1సం॥, ఫిబ్రవరి-2003
అనిత-కరుణాకర్‌రెడ్డి
కరీంనగర్

యోచిత
3సం॥, ఫిబ్రవరి-2001
రమాదేవి-రాజేంద్రప్రసాద్
బోర్నపల్లి-కరీంనగర్

చరణ్‌కుమార్
10సం॥, ఫిబ్రవరి-1994
ఉదయకుమారి-సూరిబాబు
ఆకివీడు-ప॥గో॥

తరుణ్‌తేజ
7సం॥, ఫిబ్రవరి-1997
ఉదయకుమారి-సూరిబాబు
ఆకివీడు-ప॥గో॥

పూజ
1సం॥, ఫిబ్రవరి-2003
సుజాత-ప్రభాకర్
అమలాపురం

మానసవీణ
సరిత-నరేష్
పస్రా-వరంగల్

చేతన
జ్యోతి-గంగాధర్‌రాజు
నవత్‌నగర్-హైదరాబాద్

లీడర్స్ మెయిల్

అభినందనలు

ఎన్నికల్లో ఎవరి ఓటు వారే ఉపయోగించుకునేందుకు సులువుగా అర్థమయ్యే విధంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు గురించి రాసినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు. ప్రతి పోలింగ్ కేంద్రంలోను రాష్ట్రం మొత్తం ఈ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్ని ప్రవేశ పెడితే బాగుంటుంది. రిగ్గింగ్‌ను ఈ.వి.ఎం.లు నిరోధించగలవు. పోలింగ్‌లో ఏవైనా అవకతవకలు నివారించడం సాధ్యమవుతుంది. ప్రతి ఓటు ఎవరో ఒక అభ్యర్థికి తప్పనిసరిగా చేరుతుంది.

– డి.ఎల్.గణేష్‌బాబు,
హిందూపూర్, అనంతపూర్ జిల్లా
– మంకుశ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా

'ఆరోగ్యం' మేలు చేస్తోంది

ఫిబ్రవరి 8వ తేదీ ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలోని అన్ని శీర్షికలు మా ఇంటిల్లిపాదిని ఎంతో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆరోగ్యం పేజీ సంచికకే హైలెట్‌గా నిలుస్తుంది అని చెప్పవచ్చు. ఈ వారం 'మలబద్ధకం గూర్చి దానికి గల కారణాలు, నివారణ పద్ధతులు, కొలన్‌థెరపీ ఉపయోగాలు, గూర్చి ఎంతో సవివరంగా వివరించారు.

– కామిడి సతీష్ రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

జాగృతిగీతం పలకాలి

నారాయణగారి ఈ వారం కవిత 'కొత్తపొద్దు' వర్తమాన పరిస్థితులకు అద్దం పట్టింది. మనుగడలో మార్పు రావాలి. ఎప్పుడూ మోస పోతున్న విధానానికి స్వస్తి పలికి జనగళంలో జాగృతిగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైంది. అలాగే అజ్ఞాత వ్యక్తి ఉపేందర్‌గారి కవిత ఉపమాలంకార శోభితంగా అలరారింది. దేశానికి వెన్నెముకైన రైతును స్మరించడం బాగుంది.

– షేక్ అలీవలి, మొగల్తూరు.



టూరిస్ట్‌గైడ్ బాగుంది

టూరిస్ట్ గైడ్ శీర్షికన ప్రచురించిన "దక్షిణ కాశి శ్రీకాళహస్తీశ్వరాలయం" చాలా బాగుంది. అక్కడికి వెళ్ళి స్వయంగా దర్శించుకొనే విధంగా చాలా చక్కగా వివరించారు. అలాగే కవర్‌స్టోరీలో రాబోయే ఎలక్షన్లలో ఓటు ఏ విధంగా వెయ్యాలి అనే ఆందోళన లేకుండా చాలా క్షుణ్ణంగా వివరించారు.

– చొప్పాడ ఉమామహేశ్వరరావు,
కురుపాం, విజయనగరం జిల్లా

ఆదర్శనీయురాలు

భరత నాట్యకళాకారిణి పద్మభూషణ అలర్మేల్‌వళ్ళి జీవిత విశేషాలు ఆసక్తికరంగా ఉన్నాయి. కేవలం నాట్యంలోనే కాకుండా సంగీతంలో కూడా ప్రావీణ్యం సంపాదించిన అలర్మేల్‌వల్లి కళాతృష్ణ అభినందించతగినది. దేశ విదేశాల్లో ప్రదర్శనలిచ్చిన ఆమె విద్యారంగంలో తన ఉనికిని చాటుకొని ప్రాచీన సాహిత్యాన్ని నాట్యరీతులకు అన్వయిస్తున్న వల్లి నిజంగా ఆదర్శనీయురాలు.

– గొల్ల జనార్ధన్, గుమ్మలూరు, ప.గో.జిల్లా

బాలల కథ బాగుంది

బాలల కథ 'తనదాకా వస్తే'లో రచయిత బాగా చదివింపజేశారు.

రుచిలో ప్రచురించిన సగ్గు బియ్యం వడలు తయారు చేసే విధానం భాగుంది. అలాగే ఓట్లేసే యంత్రాల కవర్ స్టోరీ చాలా బాగుంది.

– పి.ఎస్.ఎస్.కిరణ్, హైదరాబాద్

మనలో మాట

నీతి సినిమా!

సినిమా తీయాలంటె-

కోటి రూపాయలు ఖర్చు చేయాలి!

ఆ స్థాయిలో రూపాయలు ఖర్చు పెట్టి - ఆ సినిమాలో కొన్ని సుభాషితాలు గుప్పించి పుణ్యం కట్టుకోడం మంచిపనే! ఈ ప్రయత్నానికి ఎవరూ గండి కొట్టరు!

పెట్టుబడికి ఢోకా వుండదనే గ్యారంటీ వుంటే - ఆ వైపు సినిమాలు అనేకం నిర్మించి తరించడానికి నిర్మాతలు కూడా సిద్ధంగానే వుంటారు!

నీతుల్తో సినిమా చుట్టేస్తే -

ఆ సినిమా చూసే జనం ఎంతమంది?

ఇక్కడొస్తుంది పేచీ! ఏది నీతో ఏది కాదో మాక్కూడా తెలుసంటారు ప్రేక్షకులు. పురాణాల్లో సమస్తమైన నీతులు చెప్పేరంటారు. హరికతల్లో అనేకమైన నీతులు వింటూనే వుంటామంటారు. నాటకాల్లో చెప్పని నీతి లేనేలేదంటారు!

ఇన్ని విధాల అందుబాటులో వున్న 'గోల' - సినిమాల్లో కూడా మాకెందుకని విసుక్కుంటారు!

ఈ సంగత్తెలిసి కూడా అప్పుడప్పుడు కొందరు దర్శక నిర్మాతలు నీతిబ్రాండు సినిమాలు తీసి చేతులు కాల్చుకోడం మనం చూస్తూనే వున్నాం!

ఈ వాతావరణంలో-

ఇదిగో మా సినిమా! ఈ సినిమా ద్వారా మేము కొన్ని నీతులు చెప్పడానికి మీ ముందుకు వస్తున్నామని డబ్బా కొట్టుకుంటే - ఆ సవుండు దర్శక నిర్మాతలకు మాత్రమే వినిపిస్తుంది!

అంచేత-

అల్లాంటి ప్రకటనలతో జనాన్ని రెచ్చగొట్టి చేతులు కాల్చుకోడం తెలివైన పని కాదని విజ్ఞులు చెబుతుంటారు!

మరోపక్క-

ఇల్లాంటి హెచ్చరికలు చేస్తే జనంలో రోషం పెరుగుతుంది! ఆయొక్క కొత్త నీతులు ఏముంటాయుని తమని తామే మందలించుకుంటారు. మనక్కావల్సింది రెండు గంటల పాటు కాలక్షేపమని తమకి తామే చెప్పుకుంటారు!

మా సినిమా చూసి నీతులు నేర్చుకుని బాగుపడమని బోర్డులు కట్టి చితికిపోడం కంటె - నీతుల పేరిట కొత్త బూతులు నేర్పే సినిమాలకు డిమాండెక్కువని పరిశోధకులు తెలుసుకున్నారుట! శుభం!

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
రియల్‌స్టోరీ	. . . 14
ఇంతిసంగతులు	. . . 16
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

అనాథ

కథ ... 8



వామ్మో... ప్రజల వద్దకే వైద్యో... హరీ! కచేరి.... 17



విజయనగర వైభవానికి సాక్షీభూతం

టూరిస్ట్‌గైడ్ . . . 21



అల్పాక్షరాల్లో అనంతభావాలు... 'నానీ'

కళాసాహితి . . . 22, 23

ఓరా!

బాల అబ్దుల్‌కలాం

ఈ పదేళ్ళ బుడతడి పేరు అబ్దుల్‌కలాం. బీహార్‌లోని ఒక పేద ఇంట పుట్టాడు. అయితే అతని తలకట్టు అచ్చం రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకి ఉన్న మాదిరిగానే ఉంటుందిట! బాలుడి కలలు కూడా రాష్ట్రపతి అబ్దుల్‌కలాం కనే కలల లాంటివేనట. బాగా చదువుకుని పెద్దయ్యాక గొప్ప శాస్త్రవేత్త కావాలని ఈ బుడతడు కలలు కంటున్నాడు. ఈ విషయాన్నే రాష్ట్రపతి భవన్‌కు ఒక లేఖద్వారా తెలియచేశాడు. కాని తన కల నెరవేరడానికి పేదరికం అడ్డువస్తోందని ఆ బాలుడు రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నాడు. రాష్ట్రపతి అబ్దుల్‌కలాం బీహార్‌లో పర్యటించినపుడు తప్పకుండా ఆయన్ను కలుసుకోవాలని ఈ బాల అబ్దుల్‌కలాం అనుకుంటున్నాడట! కల ఫలించాలని కోరుకుందాం.

సులభ కాంప్లెక్స్‌లు కావవి!?

దేశరాజధానిలోని చాణిక్యపురి అది. అన్ని చోట్ల మాదిరిగా అక్కడ కూడా సులభ కాంప్లెక్స్‌లు ప్రజల అవసరాలు తీరుస్తుంటాయి. అయితే ఇక్కడి సులభ్ కాంపెక్స్‌లకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి ఉదయం అక్కడ కనీసం ఏడు పోలీస్ వాహనాలు పార్క్ చేసి ఉంటాయి. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో నైట్ డ్యూటీ చేసి వచ్చిన పోలీసులు రాత్రి జరిగిన నేరాలు, ఘోరాలు, వింతలు, విశేషాలు సులభ్ కాంప్లెక్స్ లోపలే ఒకరికొకరు చెప్పుకుంటారట! మొత్తం మీద తమ సులభ్‌కాంప్లెక్స్‌లు రాజధానిలో శాంతిభద్రతలు కాపాడటానికి బాగా ఉపయోగపడుతున్నాయని దాని నిర్వాహకులు తెగ సంబరపడిపోతున్నారట.



పరిశుభ్రత పాటించాలె!?



నగరాల్లోని రోడ్ల మీద ఎక్కడ చూసినా కిళ్ళీ మరకలే కనిపిస్తాయి. మహానగరాల్లో అయితే మరీను. ఇక కిళ్ళీ షాపుల చుట్టుపక్కల అయితే చెప్పనక్కర్లేదు. అయితే ముంబాయి వర్లీలోని విష్ణుప్రతాప్ సింగ్ మాత్రం ఇందుకు విరుద్ధం. కిళ్ళీలు అమ్మే విష్ణుప్రతాప్ అసలు కిళ్ళీలు తినడు. తన కిళ్ళీ దుకాణం ముందు ఎంతో పరిశుభ్రత పాటిస్తాడు. కస్టమర్లు ఎవరైనా అక్కడ ఖరాబు చేస్తే సహించడు. ఒకరోజు ఒక వ్యక్తి కిళ్ళీ తీసుకుని ఆపైన అక్కడే ఉమ్మడంతో విష్ణుప్రతాప్‌కు బాగా కోపం వచ్చింది. వెంటనే ఆ ఖాతాదారుడికి ఒక్కటి తగిలించాడు. దెబ్బకు దిమ్మతిరిగిన ఆ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని అతన్ని పారిపోనివ్వకుండా అతను ఉమ్మిన ప్రాంతాన్ని నీటితో అతనితోనే శుభ్రం చేయించాడు. తర్వాత అతను తీసుకున్న కిళ్ళీకి డబ్బు వసూలు చేసి మరీ పంపించాడట! విష్ణుప్రతాప్ చాలా ఘటికుడు కదూ?!


ఓటు
ఓటు
ఓటు
నారు

కార్టూన్ కదంబం


వచ్చే సంవత్సరంలో విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదన లేదు
ఓటు


పాంక్ షోలేడు కదా! అందుకే
పాతవే మళ్లీ తవ్వుతున్నాడు!!



మేడిపండు బిజెపి

తెలకపల్లి రవి

భారత ప్రజాస్వామ్యంలో భారతీయ జనతాపార్టీ (బిజెపి) ఒక అపశ్రుతి. స్వాతంత్ర్యపోరాటం, స్వతంత్రం తర్వాత రూపొందించుకున్న రాజ్యాంగం ప్రబోధించిన విలువలన్నిటికీ వ్యతిరేకమైన తిరోగామి శక్తి బిజెపి. విభిన్న మతాలు, జాతులు గల మన దేశ చరిత్ర, సంప్రదాయాలు, వాస్తవ అవసరాలు అన్నిటికీ విరుద్ధమైన వికృత రాజకీయాల వికటాట్టహాసానికి ప్రతిధ్వని బిజెపి. చిత్తశుద్ధి లేని ద్వంద్వ నీతికి, అవధుల్లేని అవకాశవాదానికి, అధికార దాహానికి ప్రతిరూపం బిజెపి. ప్రజాజీవిత ప్రమాణాలకు, ఆఖరుకు దేశ స్వావలంబనకు, ఆత్మగౌరవానికి కూడా ప్రమాదకారి బిజెపి. అలాటి పార్టీ ఆరేళ్లు పాలించడమే ఒక విషాదం. భారత్ వెలిగిపోతోంది అంటూ ప్రచారం ఎత్తుకున్న బిజెపి మరోసారి అధికార పగ్గాలు చేపట్టేందుకు ఏమాత్రం అనుమతించినా దేశం రగిలిపోతుంది. ఎందుకంటే మీడియా వర్గాల సహాయంతో మేడిపండులా మిలమిలలాడుతున్న బిజెపి వాస్తవానికి మహా ప్రమాదకర శక్తి, వైరుధ్యాల పుట్ట. బిజెపి రెండు నాల్కల ధోరణికి ఉదాహరణలు కావాలంటే ఎక్కడికో పోనవసరం లేదు. ఈ క్షణంలో వారు ఇందిరాకుటుంబ వారసత్వ రాజకీయాలపై గగ్గోలు పెడుతూనే మరో వైపున సంజయ్‌గాంధీ భార్యను, కుమారుణ్ని ఘనంగా పార్టీలో చేర్చుకోవడం చూస్తే చాలు.

దేశ చరిత్రలో అయిదేళ్లు కొనసాగిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం తమదని బిజెపి వారు గొప్పలు చెప్పుకుంటారు. కాని అయిదేళ్లు కొనసాగడానికి అనుసరించిన విధానాలే జుగుప్సాకరమైనవి. అలాగే ఇదివరకటి కాంగ్రెసేతర ప్రభుత్వాలు అర్థంతరంగా పడిపోవడానికి కారకులెవరు అని ఆలోచిస్తే బిజెపి ఇబ్బందిలో పడిపోకతప్పదు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పును కాపాడటం కన్నా తమ మాట నెగ్గించుకోవడమే కీలకమైనట్టు ప్రవర్తించి వాటిని కూలగొట్టింది బిజెపి వారే. ఏ పేరుతో వున్నా ఏ రూపంలో వున్నా మతోన్మాద రాజకీయాలను, మాతృసంస్థ ఆరెస్సెస్‌ను వదులుకోవడానికి నిరాకరించిన స్వచ్ఛంద సేవకులు వారే. తీగలాగితే డొంకంతా కదలినట్టు బిజెపి గురించిన ఏ చర్చయినా ఆరెస్సెస్ దగ్గరకు తీసుకువెళ్లడం అనివార్యం. ఎందుకంటే అది దాని మాతృసంస్థ. మార్గదర్శి

కళంకిత చరిత్ర

దేశ ప్రజలంతా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు అందుకు భిన్నంగా ముస్లిం వ్యతిరేకతను ముందుకు తెచ్చిన రాజకీయ సంస్థ ఆరెస్సెస్. విభజించి పాలించే బ్రిటిష్ వారి ఎత్తుగడలకు ఎంతో సహాయపడిన సంస్థ. జాతి హత్యాకాండకు పేరు మోసిన నాజీలపట్ల కూడా దానికి చాలా ఆరాధన. ఇందుకు సంబంధించిన పత్రాలను ఇటలీ పరిశోధకుడు మార్జియానా కాలసేరి వెలికి తీసి ప్రచురించారు. కేశవ బలిరామ్ హెగ్డేవార్‌ను ఆయన గురువు స్వాతంత్ర్య పోరాట పద్ధతులు నేర్చుకుని రమ్మని బెంగాల్ పంపారు. కాని ఆయన సావర్కార్ ముస్లిం వ్యతిరేక రాతలు చదివి ప్రేరణ పొందారు. హిందువులు


మతతత్వం కరాళ నృత్యం

ప్రత్యేక జాతి అని, హిట్లర్ యూదులను నిర్మూలించిన తరహాలో హిందువులు ముస్లిములను అంతమొందించాలని ఆయన చేసిన బోధలు హెగ్డేవార్‌ను ఊపేశాయి. ఆ స్ఫూర్తితోనే 1925 అక్టోబరులో దసరా రోజున ఆరెస్సెస్‌ను స్థాపించారు. హిందూమహాసభ తదితర సంస్థలతో కలసి అది ప్రధానంగా ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొడుతూ కాంగ్రెస్‌కు అంతకు మించి కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పనిచేస్తూ వచ్చింది. ఈ విషయంలో హెగ్డేవార్ జీవితకథలోనే అనేక ఉదంతాలు కనిపిస్తాయి. ఆయన మరణానంతరం దేవరస్ సర్ సంఘ్ చాలక్ అయ్యాడు.

బ్రిటిష్ వారి కుటిలనీతి, మతతత్వ నాయకుల వ్యూహాల కారణంగా దేశంలో మతకలహాల మంటలు చెలరేగినప్పుడు ఆరెస్సెస్ అందులో ముందుభాగాన నిలబడింది. దేశ విభజన సమయంలో ఇవి పరాకాష్టకు చేరాయి. ఆ తరుణంలో గాంధీజీ ఒంటరిగా నిలబడి శాంతిని పునరుద్ధరించడానికి కృషి చేశారు. హిందూ ముస్లిం సమైక్యతను ప్రబోధించారు. అంతేగాక పాకిస్తాన్, ఇండియాలు సఖ్యంగా వుండాలని, పాకిస్తాన్‌కు మన దేశం ఇవ్వాల్సిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలని పట్టుపట్టారు. ఇదంతా ఆరెస్సెస్‌కు ఏ మాత్రం మింగుడు పడలేదు. సావర్కార్ ప్రోద్బలంతో ఆరెస్సెస్ వాది నాథూరాం గాడ్సే గాంధీజీని దారుణంగా హత్య చేయడం ప్రపంచాన్నే కలచివేసింది. దాంతో ప్రభుత్వం ఆరెస్సెస్‌పై నిషేధం విధించింది. స్వాతంత్ర్య పోరాటంతో సంబంధం లేకపోవడమే కాక దాని నాయకుని హత్య చేయడం ద్వారా ఆరెస్సెస్ తనేమిటో వెల్లడించుకుంది. ఇప్పుడు అద్వానీని అభినవ సర్దార్‌పటేల్ అని వారు చెప్పు కుంటారు. కాని ఆనాడు పటేల్ హోం మంత్రిగా వున్నప్పుడే ఈ నిషేధం విధించబడిందని గుర్తుంచుకోవాలి. గోల్వాల్కర్ ఆయనను కలసి నిషేధం తొలగించుకోవడానికి విఫలయత్నం చేశాడు. కాని ఆరెస్సెస్ జాతీయ పతాకాన్ని గౌరవించకపోవడం, అప్రజాస్వామికపద్ధతులను అనుసరించడం పట్ల పటేల్ తీవ్ర అభ్యంతరాలు కొనసాగించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తామని బహిరంగ హామీ ఇవ్వాలన్నారు. ఇందుకు

కవర్ స్టోరీ

సంఘపరివార్ ఊడల మర్రి

గోల్వాల్కర్ చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. చివరకు ఎలాగో తర్జనభర్జనలు పడి, 1949 జులై 4న నిషేధం ఎత్తివేయించుకున్నారు. అప్పటి నుంచి కూడా ఆరెస్సెస్ ఆమోదిత శక్తిగా రావడానికి చాలా తంటాలు పడింది. తనకు తాను సాంస్కృతిక సంస్థ ముసుగేసుకుని, రాజకీయరంగంలో తన ప్రతినిధిని సృష్టించుకోవడానికి ప్రయాసపడింది. ఆవిధంగా భారతీయ జనసంఘ్(బిజెఎస్) పుట్టింది. శ్యామాప్రసాద్ ముఖర్జీ దాని వ్యవస్థాపక అధ్యక్షుడు. ఈయన వాస్తవంగా బెంగాల్‌లో ఫజుల్‌హక్ నాయకత్వాన గల ముస్లిం లీగ్ మంత్రివర్గంలో సభ్యుడుగా వున్న వ్యక్తి. హిందూత్వ భావజాలంతో హిందూమహాసభ నాయకుడుగా పనిచేసిన ముఖర్జీ స్వాతంత్ర్యానంతరం హిందూ ప్రతినిధులకే అధికారం అప్పగించాలని బ్రిటిష్ వారికి లేఖలు రాశాడు. కాని నెహ్రూ మంత్రివర్గంలో నిరాటంకంగా చేరిపోయాడు. పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ అలీఖాన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నందుకు నిరసనగా మంత్రివర్గం నుంచి వైదొలగారు. గోల్వాల్కర్‌తో అవగాహనకు వచ్చి జనసంఘ్ పార్టీని స్థాపించారు. మొదటి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుగా 1951 అక్టోబర్ 21న జనసంఘ్ ఏర్పడింది. ఆరెస్సెస్ తన ముఖ్యకార్యకర్తలుగా వున్న వాజ్‌పేయి, అద్వానీ తదితరులను ఆ పార్టీలో పని చేయడానికి పంపించింది. జనసంఘ్ దేశ రాజకీయాలలో అభివృద్ధి నిరోధకత్వాన్ని ప్రబోధించింది. కమ్యూనిస్టు వ్యతిరేకత దాని మూల సూత్రాలలో ఒకటిగా వుంటూ వచ్చింది. కాని ఈ దేశ ప్రజలలో బలంగా వేళ్లూనుకున్న లౌకిక సంప్రదాయాల కారణంగా జనసంఘం చాలా కాలం పాటు పెద్ద శక్తిగా రాలేకపోయింది. దానికి 1952 ఎన్నికల్లో 3.1 శాతం ఓట్లు, 3 సీట్లు మాత్రమే వచ్చాయి. 57లో 4, 62లో 14 కు చేరినా దేశ రాజకీయాల్లో ప్రధాన స్రవంతికి దూరంగా వుండిపోవలసి వచ్చింది. కాంగ్రెస్ విధానాల వల్ల ప్రజలలో పెరిగిన అసంతృప్తి 1967లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లిన సందర్భంలోనే జనసంఘం బాగా లాభపడింది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో ఐక్యసంఘటన ప్రభుత్వాలకు నాయకత్వం సంపాదించింది. 1971లో ఇందిరాగాంధీ వెల్లువ వచ్చినపుడు జనసంఘం స్వతంత్ర పార్టీ వగైరాలతో కలసి అభివృద్ధి నిరోధక కూటమి ఏర్పాటు చేసి మరోసారి దెబ్బతిన్నది. ఈ కాలమంతటా కూడా ఆరెస్సెస్ మతోన్మాద కార్యకలాపాలు, మతకలహాలు పెద్ద ఎత్తున సాగిస్తూనే వచ్చింది. అనేక కమీషన్లు, విచారణ సంఘాలు దాని విచ్ఛిన్నకర పాత్రను ఖండించాయి. సాంస్కృతిక సంస్థ ముసుగులోనే ఆరెస్సెస్ మరిన్ని అనుబంధసంస్థలను ఏర్పాటు చేసుకుంటూ తన పరిధి విస్తరించుకుంది. వీటిలో ప్రతిదానికి విద్వేష ప్రచారంలో ఒక బాధ్యత అప్పగించబడింది.

ఈ లోగా దేశంలో ఇందిరాగాంధీ విధానాల పట్ల వ్యతిరేకత పెరిగింది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీలో జెపిని, ఇతరులను అరెస్టు చేసినపుడు ఆరెస్సెస్‌వారిని కూడా

"దైవసాక్షిగా, పూర్వీకుల సాక్షిగా ఈ ప్రతిజ్ఞ పూనుతున్నాను. పవిత్ర హిందూమత, జాతి సంస్కృతిల అభివృద్ధికై, మాతృభూమి పురోభివృద్ధికి నేను అంకితమవుతాను. నా ఆత్మ, ఆలోచన, ఆర్థిక వనరులతో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్‌కు సేవ చేస్తానని ప్రమాణం చేస్తున్నాను. జీవితాంతం ఈ ప్రతిజ్ఞకు కట్టుబడి ఉంటాను."

గోల్వాల్కర్

హెడ్గేవార్

ప్రవీణ్ తొగాడియా

అశోక్ సింఘాల్

వినయ్ కటియార్

ఉమా భారతి

దుర్గావాహిని కార్యకర్తలకు తుపాకుల శిక్షణ

బిజెపి ఆరెస్సెస్‌లో భాగమా కాదా? అయోధ్య సమస్య బిజెపి అజెండాలో వుందా లేదా? బాబరీ మసీదును కూల్చింది వారేనా కాదా? వాజ్‌పేయి, అద్వానీ ఒకటేనా కాదా? బిజెపి పాకిస్తాన్‌తో స్నేహం కోరుతుందా, యుద్ధం కోరుతుందా? సామాన్యులకు సమాధానం లభించని సమస్యలివి. ఇందుకు మూలం ఆరెస్సెస్ ఫాసిస్టు తరహా రాజకీయాలలో వుంది. వంద నాలుకలు, వేయి ముసుగులతో మాట్లాడ్డం ఫాసిస్టుల లక్షణం. కాని వాస్తవమేమిటంటే బిజెపి ఆరెస్సెస్‌లో అంతర్భాగమే కాదు, అక్షరాలా దాని అడుగుజాడల్లో నడిచే పార్టీ. కాకపోతే ఆరెస్సెస్‌కు అవినీతి వంటి విషయాల పట్ల పెద్ద పట్టింపులుండవు. ముస్లిం వ్యతిరేకతే దానికి కీలకం. ఈ మైనార్టీ వ్యతిరేక అజెండా అమలు చేయడానికి ఆరెస్సెస్ అనేక అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసింది. వీటి మధ్య పనివిభజన వుంటుంది. కాని అవసరాన్ని బట్టి, ఆదేశాలను బట్టి దాంట్లో వారు దీంట్లోకి ఇలా మారిపోవడం జరుగుతూనే వుంటుంది. ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాగా భజరంగదళ్ అధ్యక్షుడైన వినయకటియార్ యుపిలో పార్టీ అధ్యక్షుడైనాడు. మహంత అవైద్యనాథ్, స్వామి చిన్మయానంద వంటివారు బిజెపి ఎంపిలుగా ఎన్నికైనారు. విహెచ్‌పి తరపున పని చేసిన సన్యాసిని ఉమాభారతి కూడా ముఖ్యమంత్రి. సంఘ పరివార్‌గా పిలవబడే ఆరెస్సెస్ కుటుంబంలో ముఖ్య విశేషాలు:

విహెచ్‌పి: ప్రత్యక్షంగా హిందూమతతత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు విహెచ్‌పిని 1964 ఆగష్టు 29న ముంబాయిలో గోల్వాల్కర్ సమక్షంలో ఏర్పాటు చేశారు. గోవధ నిషేధం జరపాలంటూ ఈ సంస్థ ఉపప్రధాని గుల్జారీలాల్ నందా నివాసంపై దాడి చేయడం అప్పట్లో సంచలనం కలిగించింది. 1984లో ఏకాత్మత యాత్ర 86 తర్వాత అయోధ్య సమస్య విహెచ్‌పి ద్వారా నడుస్తున్నాయి. దీని అధ్యక్షుడైన అశోక్ సింఘాల్ ఎప్పుడూ సాధుసంతులను సమీకరించి వివాదాలు సృష్టిస్తుంటాడు. ప్రధానకార్యదర్శి ప్రవీణ్ తొగాడియా రెచ్చగొట్టే ప్రకటనలతో విద్వేషం పెంచుతుంటాడు. విహెచ్‌పికి విదేశాల్లో శాఖల ద్వారా విశేషంగా నిధులందుతుంటాయి.

భజరంగదళ్: దీన్ని విశ్వహిందూ పరిషత్ అయోధ్య ఆందోళన కోసం 1984మేలో ఏర్పాటు చేసింది. క్రైస్తవులపై దాడులలో, స్టెయిన్స్ హత్యలో ఇదిప్రధాన పాత్రధారి.

బిజెపికి అద్వానీ వాజ్‌పేయి, విహెచ్‌పికి సింఘాల్, భజరంగదళ్‌కు వినయకటియార్ అత్యున్నత నాయకులనేది ఆరెస్సెస్ నిర్ణయం. తమ అనుబంధ సంఘాల గురించి అద్వానీ 1997 మార్చిలో కోయంబత్తూరు సభలో ఇలా స్పష్టంగా చెప్పారు: "బిజెపిలో పనిచేసే స్వయం సేవకులు మనం ఏ సైద్ధాంతిక విధానాలకు చెందిన వారమో తెలుసుకోవాలి. ఇందుకోసం మన సోదర సంఘాలు విహెచ్‌పి, ఎబివిపి, బిఎంఎస్, సేవాభారతి, కళ్యాణ్ ఆశ్రమ్ వీటన్నిటికి ప్రేరణ ఆరెస్సెస్ మధ్య గల సంబంధాలను గురించి తెలుసుకోవడానికి చైతన్యవంతంగా ప్రయత్నించాలి. మన ప్రయత్నాలను తీవ్రం చేయాలి. ఇప్పుడు ఏదైతే జరగడం లేదో అంటే ఆరెస్సెస్ భావాలను తెలుసుకోవడం జరగాలి. బెజెపిని సాధనంగా చేసుకుని రాజకీయాలలో మరిన్ని సీట్లు పొందడమే కాదు- పార్లమెంటు సీట్లు, అసెంబ్లీ సీట్లు ప్రభుత్వాలలో పాత్ర పెంచుకోగలం. తద్వారా వాటికి (ఆ భావాలకు) గౌరవం వస్తుంది.

వెంకయ్య నాయుడు

ప్రమోద్ మహాజన్

నరేంద్ర మోడి

నిర్బంధించింది. తన అప్రజాస్వామిక చర్య అభివృద్ధి నిరోధకులపై ఎక్కుపెట్టబడిందని చెప్పుకోవడానికి ఆమె చేసిన పనిని ఆరెస్సెస్ బాగా ఉపయోగించుకుంది. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ 1977లో ఎన్నికలు ప్రకటించగానే వివిధ పార్టీలు విలీనమై జనతా పార్టీ ఏర్పడినపుడు జనసంఘం అందులో భాగస్వామి కాగలిగింది. ఆ విధంగా తమ వారిని 91 మంది వరకూ ఎంపిలను చేసుకోగలిగింది. జనతా ప్రభుత్వంలో వాజ్‌పేయి విదేశాంగమంత్రిగానూ, అద్వానీ సమాచార మంత్రిగానూ కీలక స్థానాలు నిర్వహించారు. అదే సమయంలో ఆరెస్సెస్‌తో అనుబంధాన్ని తెంచుకోవడానికి నిరాకరించి, ఆ సమస్యపై జనతా ప్రభుత్వ పతనానికి కారకులైనారు. 1980 ఎన్నికల్లో ఇందిరా గాంధీ తిరిగి రావడంతో వారి ఆశలు నెరవేరలేదు. ఇక జనతా పార్టీతో పని తీరిపోయింది కనక దాని నుంచి వైదొలగి, వాజ్‌పేయి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగా ఏర్పడ్డారు. తమకు, ఆరెస్సెస్‌కు గల అనుబంధాన్ని చాలా బాహాటంగా చాటుకున్నారు. అదే సమయంలో తమది గాంధేయ సోషలిజమని ప్రకటించుకున్నారు. ఇది రెండు విధాల హాస్యాస్పదమైన విషయం. వారికి గాంధీపైన, సోషలిజంపైన కూడా విశ్వాసం లేదనే సంగతి ప్రపంచమంతటికీ తెలుసు. అయినా తమ మతోన్మాదాన్ని దాచుకునేందుకు దాన్ని ఆశ్రయించారు. వాజ్‌పేయి సంగతి అటుంచి అద్వానీ కూడా నాటి జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు లేఖ రాస్తూ గాంధేయ సోషలిజం, లౌకిక తత్వాల పట్ల తమ నిబద్ధత తిరుగులేనిదని పేర్కొన్నారు.

వ్రతం చెడినా ఫలం దక్కలేదన్నట్లు ఈ పిల్లిమొగ్గలు బిజెపి భవితవ్యాన్ని ఏ మాత్రం మెరుగుపరచలేక పోయాయి. పైగా ఇందిరాగాంధీ రాజకీయ ఎత్తుగడలు హిందూ ఓట్లను ఆకర్షిస్తున్నట్లు కనిపించింది. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతర ఎన్నికలలో బిజెపి రెండు సీట్లకు పడిపోవడంతో హతాశురాలైంది. ఈ పరిస్థితికి కారణాలు పరిశీలించాలని ఒక కమిటీని వేసింది. ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్ కూడా తమ అనుబంధాన్ని పటిష్టం చేసుకోవాలని సలహా ఇచ్చింది. ఇక మరోసారి మతోన్మాద కార్డును పూర్తి స్థాయిలో ప్రయోగించాలని నిర్ణయమైంది. గాంధేయ సోషలిజం, సమగ్ర మానవతావాదం వగైరా నినాదాలతో విజయాలు సాధించడంలో విఫలమైన వాజ్‌పేయి స్థానంలో అద్వానీ 1986లో పార్టీ అధ్యక్షులైనారు. అప్పటినుంచి తీవ్రహిందుత్వ దాని విధానమైంది. అదే సమయంలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రామజన్మభూమి తాళాలు తెరిపించడం దానికి వరప్రసాదమైంది. వెంటనే తను వెనక వుండి, విహెచ్‌పి ద్వారా అయోధ్య రామమందిర సమస్యను పెద్ద ఎత్తున రగిలించింది. ఆ సమయంలోనే బోఫోర్సు తదితర అవినీతి ఆరోపణలు రావడంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది. ఆ నేపథ్యంలో 'రామ్ రోటీ ఇన్సాఫ్' నినాదంతో 1989 ఎన్నికలలో బిజెపి జనతాదళ్‌తో పొత్తు పెట్టుకుని లోక్‌సభలో తన బలాన్ని 89 స్థానాలకు పెంచుకుంది. జనతాదళ్ ప్రణాళిక ఆధారంగా వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని బలపరుస్తానని వాగ్దానం చేసింది. కాని తర్వాత మాటతప్పి, రథయాత్ర ప్రారంభించి, అద్వానీని అరెస్టు చేయకతప్పని స్థితి కల్పించి ఆ సాకుతో మళ్లీ ప్రభుత్వాన్ని కూలదోసింది.

అద్వానీ రథయాత్ర దేశ రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన మలుపు. అప్పటివరకూ ఒక రాజకీయ పార్టీ నాయకుడు మతాన్ని అంత పచ్చిగా ఉపయోగించుకోవడం జరగలేదు. ఆయన రాముడి చిత్రం ఒకవైపు, కమలం గుర్తు మరో వైపు వేసుకుని యువతను మైనార్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతూ ఊరేగాడు. ఆయన రథం వెళ్లిన దారిపొడుగునా రక్తపుటేర్లు పారాయి. వాటినే విజయసోపానాలుగా ఆ పార్టీ భావించింది. అందుకనే 1991 ఎన్నికలలో తన బలాన్ని 120 స్థానాలకు పెంచుకుని ప్రధాన ప్రతిపక్షంగా వచ్చింది. ఇప్పుడు మరోసారి కాంగ్రెస్‌తో కలసి మెలసి వ్యవహరిస్తూ పి.వి.నరసింహారావు మైనార్టీ ప్రభుత్వాన్ని పడిపోకుండా కాపాడింది. ఆ ప్రభుత్వ అసమర్థతను ఆసరాగా తీసుకుని 1992 డిసెంబర్ ఆరున అత్యంత దుర్మార్గంగా బాబరీ మసీదును కూల్చివేసింది. దేశ చరిత్రలో మరో చీకటి అధ్యాయాన్ని సృష్టించింది. వాజ్‌పేయి, మురళీ మనోహర్ జోషి, ఉమాభారతి వంటివారు దగ్గరుండి మరీ అందుకు ఆధ్వర్యం వహించారు. అప్పట్లో యుపి ముఖ్య మంత్రిగా వున్న కళ్యాణ్‌సింగ్ రాజ్యాధి కారాన్ని దుర్వినియోగపరచి ఇందుకు అన్ని విధాల సహకరించాడు. పివి ప్రభుత్వం కూడా లౌకిక పక్షాలన్నీ మద్దతు నిచ్చినా అన్ని అధికారాలు వున్నా విధ్వంసాన్ని నివారించడంలో ఘోరంగా విఫలమైంది. అయితే ఆ తర్వాత ఎన్నికలు జరిగినపుడు ప్రజలు బిజెపి పాలనలోని మూడు రాష్ట్రాలలో దాన్ని గద్దెదించి తమ ఆగ్రహం వెలిబుచ్చారు. దురదృష్టవశాత్తూ ఆ స్ఫూర్తిని కొనసాగించడంలో లౌకిక పార్టీలు విఫలమైనాయి.

జనతాదళ్ ముక్కలు కావడం, కాంగ్రెస్ నికరంగా నిలవలేక పోవడం బిజెపికి కొమ్ములు తెచ్చింది. తత్ఫలితంగానే 1996 ఎన్నికలలో బిజెపి అతి పెద్ద రాజకీయ పార్టీగా వచ్చింది. అయితే లౌకిక పార్టీలను సమీకరించి యునైటెడ్ ఫ్రంట్‌గా నిలబెట్టడంలో వామపక్షాలు ఎంతగానో కృషి చేసిన ఫలితంగా వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పాటు చేసినా 13 రోజులలోనే కూలిపోయింది. బలపరచడానికి అదనంగా ఏ పార్టీ ముందుకు రాలేదు. తర్వాత యునైటెడ్ ఫ్రంట్ పాలన సాగింది. కాంగ్రెస్ నాయకత్వం దూరదృష్టి కోల్పోయి దాన్ని పడగొట్టి ఎన్నికలు తెచ్చింది. ఇప్పుడు బిజెపి అవకాశవాద తెలుగుదేశం వంటి మరింతమంది మిత్రులను కూడగట్టుకుని 1998లో అధికారాన్ని చేపట్టగలిగింది. జయలలిత వైదొలగిన కారణంగా ఓడిపోయినా కార్గిల్ ఘర్షణపై కుహనా దేశభక్తి రెచ్చగొట్టి 1999లో మరోసారి అధికారం చేపట్టింది.

ఈ ఆరేళ్లలో బిజెపి పాలన దేశానికి అనర్థకంగా పరిణమించిందనడానికి పెద్ద ఉదాహరణలు అవసరం లేదు. వాగాడంబరానికి పేరెన్నిక గన్న వాజ్‌పేయి బొమ్మను అడ్డం పెట్టుకుని, అన్ని రంగాలలో మతోన్మాద విషాన్ని జొప్పించింది. పాఠ్యపుస్తకాలు, ప్రసారసాధనాలు, శాస్త్ర సాహిత్య కళా వైజ్ఞానిక సంస్థలు అన్నిటా సంఘీయులను నింపేసింది. అధికారాన్ని కాపాడుకోవడానికి ఎన్ని అడ్డదోవలు తొక్కినా ఎవరితో కలిసినా ఫర్వాలేదన్నట్లు వ్యవహరించింది. బంగారు లక్ష్మణ్ తెహల్కా టేపుల నుంచి జుదేవ్ వీడియో అవినీతి వరకూ దేన్నీ పట్టించుకోకుండా కుర్చీనే పట్టుకు కూచుంది. ఈ కాలమంతటా సామాన్య ప్రజలపై భారాల పరంపర మోపుతూ సంపన్నులకు మాత్రం రాయితీల వర్షం కురిపించింది. అసలు తమ అజెండా గురించే ఎప్పటికప్పుడు రకరకాలుగా మాట్లాడుతూ కావాలని గందరగోళం సృష్టించింది. మైనార్టీలపై విష ప్రచారాలతో, దాడులతో వాతావరణాన్ని విషపూరితం చేసింది. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో గుజరాత్‌లో మైనార్టీలపై నరమేథం సాగించి, సమర్థించుకుని సర్కారును మళ్లీ హస్తగతం చేసుకుంది.

ఇదంతా వాజ్‌పేయి నాయకత్వ నైపుణ్యమని, అద్వానీ రాజనీతికౌశలమని బిజెపి వారు, దాని వంధిమాగధులు వూదరగొడుతుంటారు. కాని వాస్తవానికి దేశ విదేశ గుత్తాధిపతులకు అత్యధిక ప్రయోజనం కలిగించే రీతిలోనే వాజ్‌పేయి పాలన నడిచింది. ఎన్నికల ప్రచారాన్ని అయోధ్యలో ప్రారంభించి, రామమందిరం కట్టి తీరతామని ప్రకటించడం బిజెపి విధానాలు మారలేదనడానికి తిరుగులేని నిదర్శనం. ఆర్థిక రంగంలో కాంగ్రెస్ విధానాలనే బిజెపి మరింత ఉధృతంగా అమలు చేస్తోంది. అది చాలక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలలో తిరోగమన భావాలను, నీతిబాహ్యతను వ్యాపింపచేస్తోంది. పైకి ఎన్ని గొప్పలు చెప్పినా బిజెపికి స్వంతంగా మెజార్టి వచ్చే ప్రసక్తే లేదు. కనుక తన మనుగడ కోసం, బలపరచే మిత్రుల కోసం, నిధుల కోసం అది ఎంతకైనా సిద్ధమవుతుందని గత చరిత్ర హెచ్చరిస్తోంది. అందుకే దాన్ని ఓడించకపోతే దేశంలో ప్రజాస్వామ్యం నిలవదు సరికదా ప్రజాజీవితం కూడా అల్లకల్లోలమవుతుంది.

మతతత్వం, మార్కెట్ తత్వాల కిచిడీ లాటి బిజెపి ప్రాభవం శాశ్వతమనుకుంటే పొరబాటే. ఇప్పటికే అత్యధిక స్థానాలకు చేరుకున్న ఆ పార్టీ ఇంకా పెరగడం సాధ్యం కాదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో బాగా సీట్లు వచ్చిన రాష్ట్రాలలో రావలసిన సీట్లు ఇదివరకే వున్నాయి కనక అదనంగా రావు. మిత్రులు దూరమవడం వల్ల కలిగే నష్టమే ప్రధానంగా వుంటుంది. భారత్ వెలిగిపోతుంది అంటూ డబ్బా వాయించుకుంటున్న బిజెపి ఎన్నికల తర్వాత వెలవెల పోవచ్చు. ✦

1952-99 మధ్య లోక్‌సభ ఎన్నికల్లో జనసంఘ్ / బిజెపి సాధించిన విజయాలు

సం॥	గెల్చిన సీట్లు	ఓట్ల శాతం
1952	3	3.1
1957	4	5.9
1962	14	6.4
1967	35	9.4
1971	22	7.4
1977	91	14.0
1980	15	8.6
1984	2	7.4
1989	85	11.4
1991	120	20.1
1996	161	21.34
1998	180	25.6
1999	182	23.7

అనాథ

తడ్క నర్సింహ

సుందరం గుంటూరు వెళ్ళేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తాను ఎక్కాల్సిన ట్రైన్ కోసం ఎదురు చూస్తున్నాడు. కానీ ఇంకా రాలేదే...! అనుకుంటూ ఎదురుగా ఉన్న గోడ గడియారం వంక చూశాడు. అప్పటికి సమయం ఉదయం పదకొండున్నర దాటింది. స్టేషన్‌లో ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళతోపాటు రైల్వే ఫ్లాట్ ఫారం టీ, కాఫీ, టిఫిన్లు, పల్లీ, బఠాణీలు అమ్మేవాళ్ళు, ప్రయాణీకులను ట్రైన్ ఎక్కించడానికి వచ్చే వారితో చాలా సందడిగా వుంది. ట్రైన్ కోసం ఎదురు చూసీ, చూసీ చిరాకు పుట్టింది. ఈ ట్రైన్ ఎప్పుడూ సమయానికి రాదు కదా....! అనుకుంటూ ఎప్పుడొస్తుందో తెలుసుకునేందుకు ఎంక్వయిరీ ఆఫీసు వైపు దారి తీశాడు. కానీ ఇంకా గంట టైం ఉందని తెలుసుకున్న సుందరం చిరాకుగా వెనుతిరిగి చూడగా ఎదురుగా వున్న చెత్త కుప్పల్లో కాగితాలు ఏరుకుంటున్న "అనాథ పిల్లలపై" అతని చూపు పడింది.

చింపిరి జుట్టు, చినిగిన బట్టలు, వాడిన ముఖాలు, అభం శుభం తెలియని అమాయకత్వం...! లోకం పోకడ తెలియని నిర్మలత్వం చూస్తూ వుంటే ఎవరికైనా జాలికలగక మానదు. కానీ సుందరంకు అనాథలంటే ప్రేమ, అభిమానం ఎందుకంటే...? అతను కూడా ఒక 'అనాథే' కనుక. 'అనాథ ల' సాధక బాధకాలు తెలిసిన సాటి మనిషిగా వారిని ఏదో విధంగా ఆదుకోవాలన్న తపన.

'అనాథ'లను చూసినప్పుడు ఆ తపన మరింతగా పెరుగుతుంది. కాని అది ఎలా ? అనేది అతనికి సరైన మార్గం దొరకకపోవడం వల్ల ఏ విధంగానూ ఆదుకోలేక పోతున్నానన్న బాధం సుందరంను వేధిస్తోంది. ఆ కారణం చేత ఎదురుగా చెత్త కుప్పలో కాగితాలు ఏరుకుంటున్న అనాథ పిల్లల్ని అలాగే చూస్తూ వుండి పోయాడు. ఇంతలోనే ఎవరిదో పిలుపుతో ఉలిక్కిపడి చూశాడు. "అయ్యా ధర్మం చేయండి బాబూ! చేసిన ధర్మం ఊరికే పోదు" అంటూ ఓ ముసలి తల్లి దీనంగా అడుగుతోంది. ఆమెను చూస్తూ అతను అయ్యోపాపం ! అనుకుంటూ జేబులోంచి రెండు రూపాయలు చిక్కను తీసి ఆమెకు భిక్షం వేశాడు. మళ్ళీ అతని చూపు ఆ అనాథ పిల్లలపై పడింది.

ఇంతలో గుంటూరు వెళ్ళే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈజ్ రెడీ టూ లీవ్ అని అనౌన్స్‌మెంట్ చేశారు. అనౌన్స్‌మెంట్ విన్న సుందరం. అరే అప్పుడే ట్రైన్ వచ్చేసిందా..! అంటూ ఆ అనాథ పిల్లల్ని చూస్తూవుంటే టైమ్ తెలియడం లేదే? అనుకుంటూ వారి గురించి తెలుసుకోవాలి కదా ...? ఇప్పుడు ఎలా? అంటూ ఆతృతగా అటు ఇటూ చూశాడు. ఎవర్ని అడిగితే ఇక్కడున్న అనాథల గురించి తెలుస్తుందని అనుకుంటుండగా ఆ పక్కనే ఓ 'టీ' కొట్టు కనబడింది. అందులో ఓ అరవయ్యేళ్ళ ముసలాయన, అతనికి బాగా పెరిగిన గడ్డం.... మీసాలు, పైకి దువ్వుకున్న జుట్టు, చొక్కాలేని భుజాల మీద తువ్వాలు కప్పుకొని "టీ" అమ్ముతున్నాడు. అతని వద్దకు ఎంతో మంది వస్తూ పోతూ వుంటారు గనుక అతన్ని అడిగితే తప్పకుండా తెలుస్తుందని ! మరింత ఆత్రంగా 'టీ' కొట్టు దగ్గరకు వెళ్ళబోతూ.... ట్రైన్ వెళ్తుందేమోనని దాని వంక

చూశాడు. లేత నీలం రంగు యూనీఫాంతో కాళ్ళకు నల్లని బూట్లు, ట్రైన్ దిగి "టీ" తాగడానికి క్యాంటీన్ వైపు నడిచాడు. డ్రైవర్ "టీ" తాగొచ్చేలోపు "అనాథల" గురించి తెలుసుకొని రావాలని "టీ" కొట్టు వైపు దారి తీశాడు సుందరం. "ఏంగావాలె సారూ...! మసాలా దోస, వడ, ఇడ్లీ, పూరీ, గరం గరం టీ" ఉందని అన్నాడు ఓ పిల్లగాడు. ఆ పిల్లవాడ్ని చూస్తూ వుండిపోయాడు. "ఏంగావలె సారూ..." అంటూ మళ్ళీ అడిగాడు. పిల్లవాడ్ని చూస్తూ "అవేం వద్దు ఏక్ స్పెషల్ టీ" అంటూ ఆర్డర్ చేశాడు.

ఆ పిల్లవాడు పప్పేసుకో... చారేసుకో అన్ని వేసు ఒప్పేసుకో అంటూ పాట పాడుతూ వచ్చి టేబుల్ మీద పెడుతుంటే చేయిజారి కిందపడి "టీ" కప్పు పగిలింది. అది చూసిన 'టీ' కొట్టు యజమాని కౌంటర్ మీద నుండి గబగబ వస్తూనే "ఏరా నా కొడుకా నిన్ను ఆటలు ఆడటానికి, పాటలు పాడటానికి పనిలో పెట్టుకొన్నానేంట్రా" అన్నాడు ఆవేశంగా. సేఠ్‌ను చూస్తూ ఆ పిల్లవాడు భయంతో వణుకుతున్నాడు. "సుందరం జోక్యం చేసుకొని పోనీలేండీ కావాలని చేయలేదు కదా.... ఏదో పొరపాటు జరిగింది. వదిలేయండి" అన్నాడు. "గది కాదు సార్! ఏ దిక్కూలేని అనాథ కదా! అని పనిలో పెట్టుకుంటే వీడేమో గిట్లా చేయబట్టే ఈ గాడిదకు ఎన్నిసార్లు చెప్పిన. గంతే చెవున పట్టదు దొంగనా కొడుకు" అంటూ చేతిలో వున్న గరిటెతో పశువును కొట్టినట్లు చితక్కొట్టాడు. పక్కనే ఎవరైనా వున్నారని కూడా మరిచిపోయి కొట్టడం చూసి కోపం అణుచుకోలేక ఆవేశంగా లేచి "ఏమి మనిషివయ్యా! అట్లా కొట్టావ్." "అదికాదుసార్" అంటూ ఏదో చెప్పబోయాడు 'టీ' కొట్టు యజమాని. సుందరం చెప్పనివ్వకుండా "అమ్మానాన్నాలేని 'అనాథలు' అడగలేరనే ధీమాతోనే కదా! అట్లా బాధ పెడుతున్నావ్! అభం శుభం తెలియని వయసులో వాడ్ని పనిలో పెట్టుకోవటమే నేరం." అన్నాడు. ఆ పిల్లవాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. " ఏరా బాబూ ఇలారా" అంటూ ఆ పక్కనే వున్న సిమెంట్ బల్లపై పిల్లవాడ్ని కూర్చుండ బెట్టి "బాబూ ఇక్కడే ఉంటావా! నాతో వస్తావా!" "....." చెప్పు బాబూ! నీకు ఇష్టమైతేనే నాతోరా" అన్నాడు సుందరం.

కొద్ది సేపటికి "ఆ పిల్లవాడు మీతో వస్తా సారూ...." అన్నాడు. "నాతో వస్తే నీకు చదువు చెప్పే బడిలో వేస్తా! అక్కడే వాళ్ళు నీకు అన్నం పెడ్తారు. అక్కడ నీవు ఏ పనీ చేయాల్సిన అవసరం ఉండదు. ఇలా రోజూ నిన్ను కొట్టే వాళ్ళు ఉండరు".

"ఏమంటావ్!" అంటూ ఆ పిల్లవాడ్ని భుజం తట్టి ఆప్యాయంగా పలకరిస్తూ అన్నాడు. సుందరం. అలాగే నన్నట్లు తలూపాడు. "కానీ నీవు ఇంకో రెండు రోజులు ఇక్కడే వుంటావా? ఎందుకంటే? నేను ఆఫీసు పని మీద గుంటూరు వెళ్తున్నాను. వెళ్ళి తిరిగొచ్చేటప్పుడు నిన్ను ఇంకా ఇక్కడ వున్న నీలాంటి వాళ్ళందరినీ తీసుకెళ్తాను. నీతోటి వాళ్ళకు చెప్పు! అంటూ ట్రైన్ వంక చూశాడు. కదులుతున్నట్లు కనిపించింది. ఇక ఆలస్యం లేదనుకున్నాడు. వెంటనే పెరుగెత్తి తన సీట్లో కూర్చున్న సుందరం అనాథలను ఎలా ఆదుకోవాలో అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు. తాను "మదర్ సోషల్ ఆర్గనైజేషన్"లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ కూడా వారికి ఏమీ చేయలేక పోతున్నాను. బాధ మరింత పెరిగింది. 'టీ' కొట్టులో జరిగిన సంఘటన అతని కళ్లలో మెదులుతూనే వుంది. ఇక ఏదో విధంగా వారిని ఆదుకోవాలనుకుంటుండగా...! ఎదురుగా వస్తున్న మరో ట్రైన్ కూత శబ్దానికి గతంలోంచి వాస్తవంలోకి వచ్చిన సుందరం ప్రతి రోజూ న్యూస్ పేపర్ చదివే అలవాటు వల్ల ఈ రోజు ఏం వార్తలు ఉన్నాయో అనుకుంటూ బ్యాగ్‌లో ఉన్న న్యూస్ పేపర్ తీసి చదువుతున్న సుందరంకు ఓ ప్రకటన కన్పించింది. ఆ ప్రకటన అనాథల గురించే వున్నట్లుందే అనుకుంటూ ఆతృతగా పేపర్‌ను మరింత దగ్గరగా తీసుకొని చదివాడు.

ఆ ప్రకటన రాష్ట్రంలో 'రోజు – రోజు' కు పెరుగుతున్న 'అనాథ'లను ఆదుకోవాలనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం అనాథ ల కోసం ప్రత్యేక పథకం రూపొందించిందని, ఆ పథకం తక్షణం అమల్లోకి వస్తుందని, అయితే ఈ పథకం వృథా కాకుండా వుండటానికిగాను 'అనాథలను ఆదుకోవాలన్న తపన వున్న వారు 'అనాథ శరణాలయ' ట్రస్టును ఏర్పాటు చేస్తే ఆ ట్రస్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ట్రస్టు ఏర్పాటుకు ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఆసక్తి గలవారు 'ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తుగాని, స్వయంగా వచ్చి రాష్ట్ర అనాథ సంక్షేమం శాఖ అధికారి మరియు ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు". ఆ ప్రకటన చదివిన సుందరం ఎక్కడ లేని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న తన లక్ష్యం త్వరలో నెరవేరుతుందని అనాథలను ఎలా ఆదుకోవాలో తెలియక సతమతం అవుతున్న సుందరంకు ఒక దారి దొరికినట్టయింది .... ఆఫీసు పని అవగానే నేరుగా పేపర్‌లో వచ్చిన అడ్రస్‌కు వెళ్ళి వారితో స్వయంగా వివరాలు అడిగి తెలుసుకొని, 'అనాథ' శరణాలయ ట్రస్టు ఏర్పాటు చేసి అనాథలందరికీ ఆశ్రయం కల్పించి వారికి జీవితంలో వెలుగు నింపి అనాథలకు దారి చూపించాలనుకుంటూ....! చేతిలో ఉన్న పేపర్‌ను బ్యాగ్‌లో పెట్టి చేతికున్న వాచీని చూశాడు. గుంటూరు చేరుకోవడానికి మరో గంట పట్టవచ్చునని అనుకుంటూ కిటికీలోంచి అందమైన ప్రకృతిని చూస్తూ... ఆ ప్రకృతి నుండి వచ్చే స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు. తరువాత గుంటూరుకు చేరుకున్న సుందరం ఆఫీసు పనుల్లో నిమగ్నమయ్యాడు.

గుంటూరులో ఆఫీసు పని ముగించుకొని తిరిగి వస్తుండగా ట్రైన్‌లో తన ఎదురుగా వున్న సీటు కింద దాక్కున్న పదేళ్ళ ఓ చిన్నారి చింపిరి జుట్టు, చిక్కిన శరీరం, ఏడ్చి–ఏడ్చి లోపలికి పోయిన కళ్ళు చినిగిన గౌను... ముఖంలో ఏమి తెలియనట్టి అమాయకత్వం చూసి ఆ చిన్నారి 'అనాథేమో' ! అనుకుంటూ అలాగేచూస్తూ వుండిపోయాడు. చిన్నారి ఏదో గబా గబా తింటూ ఉంది.

ఇంతలో మా బోగీలో ఉన్న ఒకతను ఆ చిన్నారి చేయిపట్టుకొని బయటకు లాగి ఏయ్..! దొంగ ముండా! దొంగతనం చేస్తావా! అంటూ ఆ చిన్నారి చెంపమీద కొట్టిన దెబ్బలు ఎర్రగా కమిలిపోయాయి. ఆ చిన్నారిని చూస్తుంటే మనస్సు తరుక్కుపోయింది సుందరంకు. ఇక ఆవేశం అణుచుకోలేక మీరు మనుషులా? రాక్షసులా? అభం శుభం తెలియని చిన్నారిపై చేయి చేసుకుంటారా? "అనాథ" కదా! అడిగేవారు లేరని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారా...! అదే మీ కొడుకో – కూతురో అయితే ఇలా చేస్తే కొడతారా చెప్పండి? "...." చదువుకున్న వారిలా కన్పిస్తున్నారు! ఇలా మూర్ఖునిలా ప్రవర్తిస్తున్నారు ఎందుకు? అంటూ అతనిపై సుందరం మండిపడ్డాడు.

ఆ చిన్నారిని "ఇలా రా పాపా" అంటూ ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని తన ప్రక్కనే కూర్చోబెట్టు కున్నాడు. ఆ చిన్నారి భయపడుతూ అతని దగ్గరకు వస్తూనే "నే...ను ఈ దొంగతనం చేయాలని చేయలేదు సారూ... అన్నం తినక రెండు దినాలు అయ్యింది". ఆ ఆకలికి తట్టుకోలేక ఆళ్ళ దగ్గర నుండి అన్నం దొంగిలించాను అని ఏడుస్తూనే చెప్పింది'. గట్ల తప్పయితే నన్ను క్షమించండి సారూ..! అంటూనే అతని కాళ్ళ మీద పడబోయింది. సుందరం చిన్నారి భుజాన్ని తట్టి లేపి దగ్గరకు తీసుకొని వివరాలు తెలుసుకోవాలన్న తపనతో.

"నీ పేరేమిటి"

"లచ్చుండి"

"ఏవూరు మీది"

"నాకు వూరేంటి సారూ..."

"మరి ఎక్కడ వుంటావ్"

"స్టేషన్‌లో, లేకపోతే ఇలా బండిలో అడుక్కొని ఏదైన తిని ఒక మూలకు పడుకుంటాను".

"మరి నీకు అమ్మా – నాన్నా ఎవరూ లేరా...?"

అమ్మా–నాన్న ఎట్లా ఉంటారో కూడా తెలియదని, ఏదికూ్కలేని అనాథను అంటూ అమాయకంగా సమాధానం చెప్పింది.

సుందరం అనుకున్నట్లుగానే ఆ చిన్నారి 'అనాథ' అని తెలిసింది. సుందరం కళ్ళల్లో నుంచి కన్నీళ్ళు టప...టపరాలిపడ్డాయి. కన్నీళ్ళు తుడుచుకుంటూ నేను నిన్ను నాతో తీసుకెళ్తాను వస్తావా"? "...."

నాతో వస్తే నీకు చదువు చెప్పిస్తా! బడిలో వేస్తా! అక్కడ వాళ్ళు ఏ ఇబ్బందీ రాకుండా మంచిగా చూసుకుంటారు. చిరునవ్వుతో సరేనన్నట్లు సమాధానం ఇచ్చింది చిన్నారి. సుందరం హైదరాబాద్ చేరుకోగానే నేరుగా న్యూస్ పేపర్‌లో వచ్చిన ప్రకటన ప్రకారం అడ్రస్‌కు వెళ్ళి 'అనాథ' శరణాలయం ట్రస్ట్ ఏర్పాటు కోసం కావలసిన వివరాలు అడిగి తెలుసుకొని రాష్ట్ర 'అనాథ శరణాలయ' ట్రస్ట్ ఎలా నడపాలి? దాని నియమ నిబంధనలు తెలుసుకొని సంస్థ ఏర్పాటుకు గాను ప్రభుత్వం నుండి పర్మిషన్ తీసుకున్నాడు సుందరం. తన కొలీగ్స్ సహకారంతో అనాథ పిల్లల కోసం "అమ్మ" అనే పేరుతో "అనాథ శరణాలయ ట్రస్ట్" ఏర్పాటు చేసి, రైల్వే స్టేషన్‌లో, బస్టాండులో మురికివాడల్లో వున్న 'అనాథ'లను సుందరం ఏర్పాటు చేసిన 'అనాథ' శరణాలయ ట్రస్టులో చేర్పించి.. అమ్మా–నాన్న లేని 'అనాథ'లకు అతనే అమ్మా–నాన్న అయ్యాడు. ఎదురుగా వున్న అతని గురువుగారి ఫొటోను చూస్తూ ఆలోచనలో పడ్డాడు. ఆయన రైల్వే స్టేషన్‌లో చిత్తుకాగితాలు ఏరుకుంటున్న తనను చూసి మీద జాలితో తన వెంట తీసుకెళ్ళి చదువు చెప్పి ఏ లోటూ రాకుండా కన్న కొడుకు కన్నా ఎక్కువగా చూసుకున్నారు మా గురువుగారయిన" కృష్ణారావు" గారు. నాలాంటి ఎంతో మంది 'అనాథ'లను చేరదీశారు. నన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. నేను ఈరోజు ఈ స్థితికి చేరుకోవడానికి ఆయన చలవే..! ఇప్పుడు ఆయన బ్రతికుంటే ఎంతో సంతోషించేవారు. ఏ లోకంలో వున్నా ఆయన ఆత్మ శాంతించాలని మనస్ఫూర్తిగా మదిలో తలచుకున్నాడు సుందరం. ✦

టెంగ్లీష్

అంపశయ్య నవీన్

"హౌయ్ రమణా! హౌ ఆర్యూ?"

"బాగానే వున్నాను"

"బాగానే ఉన్నానేమిటి? ఫైన్, థాంక్యూ అనాలి. ఇంతకాలంగా సిటీలో ఉంటున్నావు.... నీకు సిటీమ్యానర్సేవీ అలవడినట్టు లేదు...."

"ఫరవాలేదు... సిటీ మ్యానర్స్ అలవడకపోయినా నేను బాగానే ఉన్నాను..."

"మళ్ళీ అదేమాట... సే అయామ్ ఫైన్..."

"నాకంత ఇంగ్లీషు రాదు... నన్ను వదిలెయ్"

"దట్స్ వెరీ బ్యాడ్! ఇంగ్లీషు రాకపోవడమేమిటి? నేనివ్వాళ్ళ రైతుబజార్‌కు... అదే వెజిటబుల్ మార్కెట్‌కు వెళ్ళాను. డు యూనో వ్వాట్ హేపెన్డ్ దేర్?"

"తెలీదు... మీరు చెప్పండి"

"అక్కడుండే వెజిటబుల్ వెండర్స్... అంటే కూరగాయలు అమ్ముకునే వాళ్ళు... దే ఆర్ స్పీకింగ్ ఇంగ్లీష్ యునో"

"అంటే... బి.ఏ.లు, ఎం.ఏ.లు చదివిన వాళ్ళంతా కూరగాయలమ్ముకొని బతుకుతున్నారన్నమాట."

"నో... నో... నో... వాళ్ళల్లో చాలా మంది ఇల్లిటరేట్స్..."

"అంటే నిరక్షరాస్యులు కూడా ఇంగ్లీషు మాట్లాడేస్తున్నారంటావా?"

"ఎగ్జాక్ట్లీ... నేనో కూరగాయలమ్మే ఓల్డ్‌లేడీ దగ్గరకెళ్ళాను... ఆమెను చూస్తే చాలా పూర్‌వుమెన్‌లా ఉంది... ఆమె దగ్గర కూరగాయలు కొనుక్కొని హండ్రెడ్ రూపీస్ నోటిచ్చాను... ఆ నోట్ చూసి ఆమె ఏమన్నదో తెలుసా?"

"తెలీదు"

"ఆమె అన్నమాట విని నేను షాకైపోయాను"

"ఏమిటో మిమ్మల్ని అంత షాక్ చేసినమాట"

"ఫైవ్ రూపీస్ కూరగాయలుగొన్నరు... హండ్రెడ్ నోటిచ్చింద్రు... నేను ఛేంజ్‌కెక్కడికి బోవాలె సార్? అందామె..."

"నిజంగానా?"

"హండ్రెడ్ పర్సంట్ నిజం... ఎవరిదగ్గరికైనా వెళ్ళి ఛేంజ్ తెచ్చివ్వరాదూ? అని నేనంటే" అందరూ బిజీగున్నరుసార్... ఎవ్వర్ని డిస్టర్బ్ చెయ్యమంటరు? అందామె... ఆమె మాట్లాడుతున్న ఇంగ్లీషు ముక్కల్ని వింటోంటే నేను ఫెయింటయిపోతానేమో అనుకున్నాను. నువ్వింత ఫ్రీగా ఇంగ్లీషు మాట్లాడేస్తున్నావు.. ఎంతవరకు చదువుకున్నావేమిటి? అని నేనడిగితే ఇంతపిచ్చి ప్రశ్న అడిగావేమిటి అన్నట్టుగా నవ్వేసిందామె... ఇంగ్లీషు మాట్లాడాల్నంటే చదువుకోవాల్నా సార్! అంది. చదువుకోకుండా నీకిన్ని ఇంగ్లీషు మాటలెట్లా వచ్చాయి అని నేనడిగితే "దానిదేముందిసార్... మీలాంటోళ్ళు మాట్లాడంగా వింటున్నగద... గట్ల వినే నేను గీ ఇంగ్లీషు నేర్చుకున్న" అందామె. నేను ఎంత సర్‌ప్రైజ్ అయ్యానో చెప్పలేను"

"దీన్నిబట్టి మనకేమర్థమవుతున్నదో చెప్పండి"

"మీరు చెప్పండి."

"మనలాంటి కొద్దో గొప్పో చదువుకున్న వాళ్ళమందరమూ మన సంభాషణల్లో కావాలని ఇంగ్లీషు పదాల్ని విరివిగా వాడేస్తున్నాము.. అట్లా ఇంగ్లీషు మాటల్ని దొర్లించడం చాలా గొప్పనుకుంటున్నాము... నాగరికతకు చిహ్నం అనుకుంటున్నాము.. సాధారణంగా మనలాంటి నాగరికుల్నీ, చదువుకున్న వాళ్ళనీ వేరే వాళ్ళు అనుకరిస్తూ ఉంటారు. ఇంగ్లీషు పదాల్ని విరివిగా వాడెయ్యటం నాగరికుల లక్షణం కాబోలు అనుకుంటారు. అందుకే ఎక్కువగా చదువుకోని వాళ్ళు కూడా తమ సంభాషణల్లో ఇంగ్లీషు మాటల్ని జొప్పించటాన్ని అలవాటు చేసుకుంటారు. మనలాంటి వాళ్ళమే ఇవ్వాళ్ళ కూరగాయల మార్కెట్లో కూడా అందరూ సగం ఇంగ్లీషు, సగం తెలుగు మాట్లాడటానికి కారకులం అవుతున్నాం... ఇది ఇలాగే కొనసాగితే దైనందిన జీవితంలో తెలుగు వాడకం బాగా తగ్గిపోయే ప్రమాదం ఉంది. తెలుగులో తెలుగు పూర్తిగా తగ్గిపోయి ఇంగ్లీషు మాత్రమే మిగిలిపోయే రోజు త్వరలోనే రావచ్చు"

"మీరు మరీ ఎగ్జాజిరేట్ చేస్తున్నారెండి... తెలుగులో కొన్ని ఇంగ్లీషు మాటలు చేరిపోవడం వల్ల తెలుగుభాష ఇంకా స్ట్రెంథెన్ అవుతుంది. తెలుగు చాలా మోడరన్‌గా, ఫాషనబుల్‌గా తయారవుతుంది. దాంట్లో తప్పేముంది?"

"చాలా తప్పుంది. ఇంగ్లీషు మాటలకు సరిగ్గా సరిపోయే తెలుగు మాటలు లేనప్పుడు ఇంగ్లీషు మాటలు వాడొచ్చు. తప్పులేదు. ఉదాహరణకు రోడ్డు, రైలు, బస్సు, టికెట్, గేటు మొదలైన వాటిని తెలుగులో చెప్పుకోవచ్చు. కానీ ఎవరినైనా "హౌ ఆర్యూ"? అని అడగటం ఎందుకు? "అయామ్ ఫైన్" అని జవాబు చెప్పడమెందుకు? బావున్నారా? అనొచ్చుకదా.. బావున్నాను అని చెప్పొచ్చుకదా... కూరగాయల్ని వెజిటబుల్స్ అనడం ఎందుకు? కూరగాయలు అని అనొచ్చుకదా. "షాకయ్యాను" అనే బదులు "చాలా ఆశ్చర్యపడ్డాను" అనొచ్చు కదా... ఎగ్జాజిరేట్ చేస్తున్నారు అనే బదులు చాలా ఎక్కువ చేస్తున్నారు అనొచ్చు కదా.. పోనీ మాట్లాడితే పూర్తిగా ఇంగ్లీషులోనే మాట్లాడండి.... లేకపోతే చక్కగా తెలుగులో మాట్లాడండి. అంతేగానీ ఈ సగం తెలుగు, సగం ఇంగ్లీషు ఏమిటండీ? ఇవ్వాళ్ళ టీవీ ఛానెల్స్‌లో యాంకర్స్ అనే వాళ్ళుంటారు చూడండి. వాళ్ళు మాట్లాడే ఈ సంకరభాష వింటుంటే డోకొస్తుందంటే నమ్మండి. వాళ్ళు మాట్లాడే తెలుగులో మూడొంతులు ఇంగ్లీషు, ఒకవంతు తెలుగు... ఈ తెలుగు, ఇంగ్లీషు కలిపి మాట్లాడే భాషను 'టెంగ్లిష్' అనాలని ఓ ప్రముఖ పత్రిక ఈ సంకర భాషకాపేరు పెట్టింది. ఈ టెంగ్లిష్ వల్ల ఈనాటి మన యువతరానికి మాతృభాష తెలుగు రావడం లేదు. పరాయి భాష ఇంగ్లీషూ రావడం లేదు. బాధాకరమైన విషయమేమిటంటే మన మాతృభాష మీద మనకు గౌరవం లేదు. అభిమానం లేదు. మన భాషకు పట్టిన ఈ దుస్థితి మారాలి." ✦



కుంటి రౌతు

పుప్పాల కృష్ణమూర్తి

బాగ్దాద్ నగరంలో అమర్ అనే వర్తకుడు వుండేవాడు. అతని దగ్గర మేలు జాతి గుర్రం వుండేది. దాని మీద దేశం మొత్తం తిరుగుతూ బెల్లం వ్యాపారం చేసేవాడు. ఒకసారి పెద్ద మొత్తంలో సరుకు తెస్తుంటే వర్షంలో తడిసి, కరిగిపోయింది. దాంతో బాగా నష్టపోయాడు. ఇక వ్యాపారం మానేద్దామనుకున్నాడు. అందుకని తన గుర్రాన్ని అహ్మద్ అనే వ్యాపారికి అమ్మజూపాడు. రెండు వేల దీనారాలకు బేరం కుదిరింది. అతడు అమర్‌కు డబ్బు ఇచ్చేసి, గుర్రాన్ని తోలుకుపోయాడు. ఆ రోజు మంచిరోజుకాదన్ని, గుర్రాన్ని ఎక్కకుండా కొష్టంలో కట్టేశాడు. రాత్రివేళ చక్కగా ఉలవల పిండి, పచ్చగడ్డి వేసి బాగా మేపాడు. మరునాడు ఉదయమే గుర్రాన్ని ఇంటి బయటికి తీసి, ఊళ్లోకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. గుర్రం మీద ఎక్కి ఒక దెబ్బ వేశాడు. అది మెల్లగా ముందుకు కదిలింది. మూడు కాళ్ల మీద నెమ్మదిగా నడుస్తూ, ముందు కుడి కాలు కుంటసాగింది. అహ్మద్ వెంటనే గుర్రం దిగి కళ్లెం పట్టుకుని నడిపిస్తూ 'అమర్ నన్ను మోసం చేశాడే! కుంటి గుర్రాన్ని మంచి గుర్రమని అంటగడతాడా? వెళ్లి అడుగుతాను' అనుకుంటూ అమర్ దగ్గరకు వెళ్లాడు.

"గుర్రానికి ఏ వంక లేదు. నీ ఇష్టమొచ్చినంత దూరం స్వారీ చేయొచ్చు. మేలుజాతి అరబ్బు గుర్రం' అని నన్ను మోసం చేస్తావా? పనికి రాని కుంటి గుర్రాన్ని అంటగడతావా? కాస్త కాదు. కూస్త కాదు. రెండు వేల దీనారాలు పెట్టాను గుర్రానికి' అని తగాదా వేసుకున్నాడు అహ్మద్.

"నేను నిన్నేమీ మోసం చేయలేదు. నీ ముందే గుర్రం మీద స్వారీ చేసి చూపించాను. మనకు మధ్యవర్తిగా సమద్ కూడా వున్నాడు. కావాలంటే వెళ్లి అతన్నే అడుగుదాం" అన్నాడు అమర్.

"నాకదేం తెలీదు. కుంటి గుర్రాన్ని అంటగట్టావు. నేనెటూ స్వారీ చేయలేదు. రాత్రంతా కొష్టంలోనే కట్టేసి వుంచాను. కావాలంటే చూడు" అని గుర్రం ఎక్కి అదిలించాడు. అది మెల్లగా నడుస్తూ ఒక కాలు కుంటినట్లుగా నడవసాగింది. అది చూసిన అమర్ 'గుర్రానికి ఎటువంటి లోపంలేదని, రౌతును బట్టే అది సరిగా నడవడం లేదని గ్రహించాడు. ఆ భావం మనసులోనే వుంచుకుని, 'రాత్రి గుర్రం కాలుని పురుగు కుట్టినట్లుంది. అందుకే అదలా కుంటుతోంది. నీకిష్టం లేకపోతే తిరిగి నాకే అమ్మేసేయ్. కొంటాను' అన్నాడు.

"సంతోషం. నేనిచ్చిన రెండు వేల దీనారాలు తిరిగిచ్చేయ్" అన్నాడు అహ్మద్.

"నేను మంచి గుర్రాన్ని రెండు వేల దీనారాలకు అమ్మాను. ఇప్పుడది కుంటిది. కనుక వెయ్యి దీనారాలకయితే తీసుకుంటాను. లేకుంటే లేదు' అని చెప్పేశాడు అమర్.

"ఆ కాలు నయమవుద్దో కాదో. ఒకవేళ ఛస్తే నేను పూర్తిగా నష్టపోవాల్సి వస్తుంది' అనుకొని 'సరే! ఆ వెయ్యే ఇవ్వు' అన్నాడు.

వెయ్యి దీనారాలు ఇచ్చేసి తిరిగి తన గుర్రాన్ని కొనుక్కున్నాడు అమర్. మరునటి రోజు ఆ గుర్రాన్ని అమీర్ అనే వ్యాపారికి రెండు వేలకు అమ్మాడు. ఆ వ్యాపారి షాపు అహ్మద్ షాపు పక్కనే వుంటుంది. అతనికి గుర్రపు స్వారీ బాగా వచ్చు. గుర్రం మీద దుకాణానికి వచ్చాడు. దాన్ని చూడగానే, "అరే! ఇది నేను అమ్మిన గుర్రమేనే. ఎంతకు కొన్నావు?" అనడిగాడు అహ్మద్.

"రెండు వేల దీనారాలకు. అయినా గుర్రం బావుంది. మేలు జాతిది'' అని మెచ్చుకున్నాడు అమీర్.

అహ్మద్ వెంటనే అమర్ దగ్గరకు పరిగెత్తి, 'కుంటి గుర్రమని చెప్పి తక్కువ రేటుకు కొంటావా? అది చక్కగా పరిగెత్తుతోంది. నన్ను మోసం చేశావు'' అని బజార్లో తగాదా వేసుకున్నాడు.

"నీకు గుర్రపు స్వారీ తెలీదు. కనుక నువ్వే కుంటివాడివి. గుర్రానికేం. లక్షణంగా వుంది. స్వారీ తెలీకుండా, గుర్రం మీద తిరగాలనుకోవడం నీ తప్పు. ముందు గుర్రపు స్వారీ నేర్చుకో. ఆ తర్వాత గుర్రాన్ని కొందువుగాని" అని చెప్పి పంపాడు అమర్. 'స్వారీ తెలీకుండా కొనడం నాదే బుద్ధి తక్కువ' అనుకుంటూ తలవంచుకొని వెనుదిరిగాడు అహ్మద్. ✠



ఎవరి నోరు పెద్దది!

హాయ్ నేస్తాలూ... ఏంటి గత వారం మేజిక్ బావుందా? ఈ రోజు మీ ముందుకు రెండు బెకబెకలు వచ్చాయి. అదేనర్రా. కప్పలు. ఇవి రెండూ నోళ్లు తెరచి గుడ్లు ఇంతింతవి చేసుకుని చూస్తున్నాయికదూ. ఈ ఫోజు ఎందుకు పెట్టాయంటే... అందుకు ఓ పెద్ద కథే వుందిలే. అయినా మీకు చెప్పక తప్పదు కదా. ఈ రెండు బెకబెకలు తల్లీపిల్లలు. తల్లి 'ఈ' అని నోరు తెరచి 'నా నోరే పెద్దది' అంది పిల్లతో. అప్పుడు పిల్లమాత్రం తక్కువ తిందా!



మేజిక్! మేజిక్!!

'ఇ...ఈ..' అని నోరు తెరచి 'చూస్కో ఇప్పుడు. నా నోరే పెద్దగా వుంది' అంది. ఈ దృశ్యం చూసిన ఆర్టిస్ట్ అంకుల్ చకచకామని బొమ్మ వేసేశాడు. మీరు చెప్పండర్రా ఈ బెకబెకల్లో ఎవరి నోరు పెద్దది? 'ఇందులో కష్టం ఏముందండీ. తల్లి కప్ప నోరే పెద్దది' అంటున్నారు కొందరు నేస్తాలు. కానీ చిన్నారులూ... ఒక్కసారి మీరు స్కేలుతో కొలిచి చెప్పండి? కొలిచారా? ఆ...ఇప్పుడు చెప్పండి. 'ఇదేంటండీ? రెండు బెకబెకల నోళ్లూ ఒకటిగానే వున్నాయి' అంటున్నారు కొందరు మిత్రులు. ఆ... ఇప్పుడు మీరు చెప్పింది అసలు జవాబు.

చిన్నారి చిత్రకారులు

పూజారి దుర్గాప్రసాద్,
7వ తరగతి, జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్,
పెద్దాపురం.

అల్లి నాగేశ్వరరావు,
పెద్దాపురం.



డి.ప్రత్యూష,
7వ తరగతి,

బచ్చు అన్నపూర్ణ,
4వ తరగతి,
శ్రీ భారతిపబ్లిక్‌స్కూల్,
పెద్దాపురం.

రంగులు అద్దుతారా!



క్విజ్-97

1. బొగ్గు వేటి నుంచి తయారవుతుంది?

ఎ. చెట్లు బి. రాళ్లు

2. ఏ బట్టలను ఎండలో ఆరవేయకూడదు?

ఎ. పట్టు బి. ఖద్దరు

3. ఉప్పు-నిమ్మకాయలు ఏ మరకలను పోగొడతాయి?

ఎ. టీ, కాఫీ బి. సిరా

4. ఏడుకొండల నగరం అని దేనిని అంటారు?

ఎ. రోమ్ బి. తిరుపతి

5. 'మహామల్లుడు' ఎవరు?

ఎ. మొదటి నరసింహుడు బి. రెండవ పులకేశి

6. అక్బర్ గురువు ఎవరు?

ఎ. అబుల్ ఫజల్ బి. బైరాంఖాన్

7. ఒకే సరి ప్రధాన సంఖ్య ఏది?

ఎ. 2 బి. 3

8. పిగ్మీలు ఎక్కడ వుంటారు?

ఎ. దక్షిణ ఆఫ్రికా
బి. ఆస్ట్రేలియా

9. 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' రచయిత ఎవరు?

ఎ. జవహర్‌లాల్‌నెహ్రూ
బి. అంబేద్కర్

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?

ఎ. పి.సుశీల
బి. జిక్కి

క్విజ్ 96కు జవాబులు

1.ఆఫ్రికా 2. గెలాక్సీ 3. పాలపిట్ట 4. వాలిస్‌నేరియా 5. గుండె 6.కంగారూ 7. సరోజినీనాయుడు 8. గవర్నర్ 9. జనుము 10. జె ఎమ్. లింగ్డో

క్విజ్ 95కు సరైన సమాధానాలు రాసిన వారు :

యం.అవినాష్, 9వ తరగతి, ప్రగతి ట్యుటోరియల్స్, అమలాపురం. **ఎల్.రామకృష్ణ,** 8వ తరగతి, గరిడేపల్లి, నల్గొండ. **పి.పార్వతి,** 10వ తరగతి, మేడికొండూరు, గుంటూరు. **పి.పాండురంగారావు,** 10వ తరగతి, విజయనగరం. **ఎం.మల్లయ్యగౌడ్,** 6వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, రంగారెడ్డి. **జి.పద్మ సి.విశాఖ** 10వ తరగతి, పార్వతీపురం, విజయనగరం.

కలం స్నేహం

పేరు: క్రోసూరి వర్ష
వయసు : 10 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : డ్రాయింగ్ వేయడం, డాన్సు చేయడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా: క్రోసూరి వర్ష, డాటరాఫ్ సుబ్బారావు, 1-1-5/3, ముషీరాబాద్, హైదరాబాద్.

పేరు: ఐ.రమా కుమారి,
వయసు : 11సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు : బొమ్మలు వేయడం, పేపరు, పుస్తకాలు చదవడం.
పూర్తి చిరునామా : ఐ.రమా కుమారి, డాటరాఫ్ ఐ.నాగేశ్వరరావు, ఎంఎంఎస్ మెకానిక్స్, ఇం.నెం: 30-15-901/3, దాబా గార్డెన్, విశాఖపట్నం.

హిరణ్యకుడు, లఘుపతనకుడు, మంధరుడికి ఓ లేడికూడా తోడైంది. దాని పేరు చిత్రాంగుడు. ఇవి నాలుగూ కలిసిమెలిసి వుండసాగాయి. ఓ రోజు మేతకోసం వెళ్లిన లేడి ఎంతకూ తిరిగిరాలేదు. తాబేలు అప్పుడు కాకిని, ఎలుకను చూసి 'చిత్రాంగుడు ఇంతవరకు రాలేదు. ఏదైనా ఆపద వాటిల్లిందేమోనని అనుమానంగా వుంది. వెళ్లి వెతకండి. నేను నీటిలో తిరిగినంత వేగంగా నేలపైన తిరగలేనుకదా' అంది.

'నేను పక్షులన్నింటికంటే బాగా వేగంగా ఎగరగలను. అందుకే నన్ను లఘుపతనకుడు అని పిలుస్తారు. మీరు ఇక్కడే వుండండి. నేను లేడి జాడ చూసి వస్తాను' అంది కాకి.

కాకి లేడిని వెతుకుతూ తిరుగుతుండగా ఓ చోట వలలో చిక్కుకున్న లేడి కనపడింది. వెంటనే కాకి దాని ముందు వాలింది.

'మిత్రమా! చిత్రాంగా!! నువ్వు చీమకుకూడా హాని తలపెట్టవే. నీకు ఇలాంటి కష్టం ఎలా కలిగింది?' అంది కాకి.

'ఏం చెప్పను నేస్తం' అంది దీనంగా లేడి.

'జరిగిన దానికి విచారించి ఉపయోగం లేదు కదా. ముందు ఈ అపాయం నుంచి బయటపడే ఉపాయం గురించి ఆలోచించాలి' అంది కాకి.

అప్పుడు లేడి ఆలోచించి 'నువ్వు వెంటనే వేగంగా వెళ్లి హిరణ్యకుడిని తీసుకురా. అతనైతే ఈ వలతాళ్లను కొరికి నన్ను కాపాడగలడు. వేటగాడు రాకముందే ఈ పనిచేయాలి. వెళ్లు. లేకపోతే నాకు ఇదే చివరి రోజవుతుంది' అంది.

కాకి వెంటనే రెక్కలు విదుల్చుకుని ఒక్క ఉదుటున బయలు దేరింది. జరిగిన విషయం మంధరుడికి, హిరణ్యకుడికి చెప్పింది. చిత్రాంగుడికి వచ్చిన కష్టం విని వాళ్లు ఎంతో బాధపడ్డారు.

లేడి - కాకి



'వేటగాడు రాకముందే అక్కడకు వెళ్లడం కష్టమేమో. ఎలాగబ్బా' అంటూ హిరణ్యకుడు ఆలోచనలో పడ్డాడు.

'నువ్వు దాని గురించి కంగారుపడకు నేస్తం. నా వీపుమీద కూర్చోబెట్టుకుని నిన్ను తీసుకువెళతాను' అంది కాకి.

అప్పుడు ఎలుక కాకి వీపుమీద ఎక్కి కూర్చుంది. కాకి వేగంగా ప్రయాణించి లేడి ముందు వాలింది. వెంటనే ఎలుక కాకి వీపుమీదనుంచి దిగి వల తాళ్లు పటపటా కొరికివేసింది.

వలనుంచి బయటపడిన లేడి సంతోషంగా లఘుపతనకుడికి, హిరణ్యకుడికి ధన్యవాదాలు తెలిపింది. ఇక తమకోసం ఎదురుచూసే మంధరుడిని కలుసుకోవడానికి ముగ్గురూ అక్కడినుంచి బయలుదేరారు.

మార్గ మధ్యలో హిరణ్యకుడు చిత్రాంగుడిని ఇలా అడిగాడు.

'చిత్రాంగా! నీవు చాలా మంచివాడివి. బుద్ధిమంతుడివి. అయినా ఈ వుచ్చులో ఎలా చిక్కుకున్నావు?'

చిత్రాంగుడు గట్టిగా శ్వాసపీల్చి 'ఎంత మంచివారైనా, బుద్ధిమంతులైనా అప్పుడప్పుడు కష్టాలు అనుభవించక తప్పదు. నేను ఈ ప్రమాదంలో చిక్కుకున్న వైనం చెప్తాను వినండి' అని చెప్పసాగాడు.

(ఆ కథ ఏంటో తెలియాలంటే వచ్చే వారం వరకు ఆ..గా...ల్సిం...దే)

రియల్‌స్టోరీ

శిథిలాల నుండి ఏడడుగులు

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

అర్థరాత్రి నగరం అంతా నిద్రమత్తులో ఉంది. చల్లగాలికి ఆసుపత్రిలో వార్డులన్నీ మౌనంగా వున్నాయి. ఎముకల్ని కొరికేసే చలిలో వార్డుబాయిలంతా ముసుగుతన్ని పడుకున్నారు. డ్యూటీ డాక్టర్లు చలిచొరపడని మూలన కునికిపాట్లు పడుతున్నారు. పుణెలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రశాంతంగా ఉంది.

అవని షాకి తెలివి వచ్చింది.

కళ్ళు విప్పి చుట్టూ చూసింది. అందరూ తెల్లని ముసుగులు కప్పుకున్నట్టు వార్డులో పడుకుని వున్నారు. మెడవరకూ కప్పిన దుప్పటిని తొలగించాలని చూసింది. ఎడమచెయ్యి రాలేదు. మనసు నుంచి చేతికి సంకేతం అందుతున్నప్పటికీ ఫలితం కన్పించడం లేదు.

అవని షాకి ఏమీ అర్థం కాలేదు.

గట్టిగా అరుద్దామని అనుకుంది. నీరసంతో నోట్లో పిలుపు చిన్న మూలుగులా బైటికి వచ్చింది.

'ఏమైంది తనకు? ఎందుకు ఆసుపత్రిలో చేర్పించారు. తన వాళ్ళందరూ ఎక్కడ ఉన్నారో, ఏమైపోయారో? 'అవని షాలో ఆలోచనలు సుళ్ళు తిరిగాయి. ఆమె కదలిక చూసిన నర్సు దగ్గరికి వచ్చి కుడిచేతికి ఇంజక్షన్ చేసింది. తర్వాత అవని షా శరీరంలో మత్తు క్రమంగా వ్యాపించింది. 'తన కుడి చెయ్యికి ఏమీ కాలేదు...' ఆమె తన మనసులో అనుకుంటుండగా కళ్ళు మూతలుపడ్డాయి.

"ఎలా ఉంది డాక్టర్?" ప్రాణానికి ప్రమాదం లేదు కదా?" ఎవరో యువకుని కంఠం వినిపించిన తర్వాత అవని షాకు మెళుకువ వచ్చింది.

కళ్ళు విప్పి చూసింది.

డ్యూటీ డాక్టరు ఒక్కొక్క బెడ్ వద్దకు వచ్చి రోగుల ఆరోగ్య విషయాలను అడుగుతున్నారు. డాక్టర్‌తో ఆ యువకుడు చనువుగా నిలుచుని మాట్లాడుతున్నాడు.

"మిస్టర్ జిగర్ రాజ్‌గౌర్! మీరు చేర్పించిన అమ్మాయి కోలుకుంది... మరేం ఫర్వాలేదు. ఇప్పుడే నిద్రలేచినట్లుంది!" డాక్టర్ చెబుతున్నాడు.

"ఎలా ఉంది..." అంటూ బెడ్‌పక్క నున్న స్టూలు పైన కూర్చున్నాడు జిగర్.

అవని షా జిగర్‌ను పరిశీలనగా చూసింది.

నీలంరంగు మిలటరీ దుస్తుల్లో ఉన్నాడు. కళ్ళు చురుగ్గా ఉన్నాయి. ఆ కళ్ళల్లో ఆత్మీయత, అనురాగం కనిపించాయి. దూరదేశాల నుంచి తిరిగి వచ్చిన మిత్రుడ్ని కలుసుకున్నట్లు అనిపించింది.

"నిన్ను పుణె తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పింది ఈ అబ్బాయే... భుజ్‌లో మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో పని చేస్తున్నాడు..." పక్కనున్న నర్సు చెప్పింది.

అవనిషాకు జరిగిన విషయం లీలగా గుర్తుకు వచ్చింది. ఏం జరిగిందన్న విషయం స్పష్టంగా తెలియడం లేదు. కళ్ళ నుంచి నీళ్ళు ఒలుకుతున్నాయి. దణ్ణం పెట్టడానికి రెండు చేతులు ఎత్తింది. కుడిచేయి మాత్రం బైటికి లేచింది. ఎంత ప్రయత్నించినా ఎడమ చెయ్యి కనిపించడం లేదు.

అవని షాకు దుఃఖం తన్నుకు వచ్చింది. చెక్కిళ్ళు కన్నీళ్ళతో తడిచిపోయాయి.

ఆమెను అలా చూస్తుంటే జిగర్ కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి. "చెయ్యి లేదని బెంగపడొద్దు... అందరిలానే నువ్వు అన్ని పనులూ చేయగలవు... నీకు నేనున్నాను...." జిగర్ ధైర్యాన్నిచ్చాడు.

అవని షా కడుపారా వెక్కివెక్కి ఏడ్చింది.

* * *

వైభవ్ కాంప్లెక్స్ భుజ్ పట్టణంలో అందమైన అపార్టుమెంటు. వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతోమంది

ఆ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటుంటారు.

2000 సంవత్సరంలో అవని షా కుటుంబం ముంబాయి నుంచి గుజరాత్ రాష్ట్రం భుజ్ పట్టణానికి వలస వచ్చింది. అతి ప్రయత్నం మీద వైభవ్ కాంప్లెక్స్‌లో ఒక ఫ్లాటు అద్దెకు లభించింది.

రద్దీ ఎక్కువగా వున్న ప్రాంతంలో కింద షాపింగ్ కాంప్లెక్స్ పైన ఇళ్ళు... అవని షాకు ఆమె చెల్లెలు భీనాకు ఆ ప్రాంతం ఎంతగానో నచ్చింది. సాయంత్రం అపార్టుమెంటు పిట్టగోడమీద కూర్చుని లేదా బాల్కనీలో కుర్చీల్లో కూర్చుని టీ తాగుతూ జనసముద్రాన్ని చూడటం వారికి ఎంతో ఇష్టంగా ఉండేది.

2001 జనవరి 26.

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పబ్లిక్ హాలీడే. నలుగురు కుటుంబ సభ్యులూ ఇంటిలోనే వున్నారు.

ఆ సమయంలో భూకంపం సంభవించింది.

బాల్కనీలో నిల్చున్న అవని షాకు ఏమీ తెలియలేదు. లోపలనున్న అమ్మ, నాన్న, చెల్లెలిపైన భవంతి కూలిపోయింది. బాల్కనీ నుంచి కిందపడ్డ అవని మీద ఏదో బరువుగా పడింది. కదలలేకపోయింది. ఏం జరిగిందో తెలుసుకునే సరికే కోమాలోకి జారిపోయింది.

మూడు రోజుల పాటు శిధిలాల మధ్య కొన ప్రాణంతో అవనిషా కొట్టుమిట్టాడింది. కాంక్రీటు పై కప్పు కింద రాళ్ళ మధ్య ఖాళీ స్థలంలో ఇరుక్కుపోవడంతో ఆమెకు ప్రాణాపాయం సంభవించలేదు. సైనిక సహాయ బృందాలు ఆమెను కనుగొని ప్రాణంతో ఉన్నట్లు గుర్తించారు.

సహాయ కార్యక్రమాలకు విచ్చేసిన జిగర్ రాజ్‌గౌర్ అవని షాను పుణె ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్పించారు. ఆ ప్రమాదంలో ఆమె ఎడమ చేయి రాళ్ళ కింద నలిగి పిప్పి అయిపోయింది. కాలు దెబ్బతింది. తక్షణం చెయ్యిని తొలగించి చికిత్స ప్రారంభించారు. మొత్తం కుటుంబ సభ్యులందరినీ కోల్పోయి వంటరిగా మిగిలిన అవనిషాకు జిగర్ అండగా నిలిచాడు. తాను పని చేస్తున్న మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు సెలవు పెట్టి మరి ఆమె సంరక్షణ బాధ్యత స్వీకరించాడు.

* * *

ముంబాయికు చెందిన పంకజ్, జయబాలషా దంపతులు సేవా కార్యక్రమాల్లో కొంతకాలంగా చురుగ్గా పాల్గొంటున్నారు. ఆపన్నులను ఆదుకోవడంలో వారు అందరికన్నా ముందు ఉంటారు.

గుజరాత్ భూకంప బాధితుల దయనీయ గాథలు ఇంగ్లీషు పక్షపత్రికలో చూసి చలించి పోయారు. అందరినీ కోల్పోయి అనాథలుగా ఉన్న వారిని ఒకరినైనా ఆదుకోవాలని నిశ్చయించుకుని పుణెలో అవని షాను కలుసుకున్నారు.

ఒక చెయ్యి కోల్పోయి మాట్లాడలేకపోతున్న ఆమె ఫిజియోథెరపి శిక్షణ తీసుకుంటోంది. అతి కష్టం మీద మాట్లాడగలుగుతోంది.

పంకజ్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను కలుసుకుని ఒంటరిగా ఉన్న అవని షాను తాము పెంచుతామని ఆమె అవసరాలన్నీ తీరుస్తామని తమ కూతురుగా చూసుకుంటామని చెప్పారు.

వారి నిర్ణయాన్ని ఆయన అభినందించారు.

"పెళ్ళీడుకొచ్చిన యువతిని... అంగవైకల్యంతోనూ వంటరితనంతోనూ బాధపడుతున్న వ్యక్తిని మీ మనిషిగా స్వీకరించడం మీ దయార్ద్రహృదయానికి నిదర్శనం!" అని చీఫ్ మెడికల్ ఆఫీసర్ భరత్ అభినందించారు.

ఈ విషయాన్ని అవని షాకు కూడా చెప్పారు.

ఆమె మొదట ఏమీ మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అంది. "నన్ను మనిషిగా మార్చినది జిగర్... నేను ఈ స్థితిలో ఉండటానికి కారణమైన ఆయనతో సంప్రదించాక మీతో వస్తాను!" అంది.

జిగర్ రాజ్‌గౌర్ ఆ సాయంత్రం భుజ్ నుంచి వచ్చి ముంబాయి నుంచి వచ్చిన పంకజ్, జయబాలషా దంపతుల్ని అభినందనలతో ముంచెత్తాడు. 'మీరు నిజంగా ప్రత్యక్ష దైవాలు... చేతులెత్తి మొక్కాలి...' అంటూ అవని షాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

అవని షా వారితో ముంబాయి వెళ్ళిపోయింది.

తన చేతిరాత ఎడమ చెయ్యి కాగా అంది లేనందున కుడిచెయ్యితో రాయడం నేర్చుకుంది. తనకు ఇష్టమైన కంప్యూటర్‌ను ఒక చెయ్యితో పరుగెత్తించడం



నేర్చుకుంది.

పంకజ్ దంపతులు హామీని నిలబెట్టుకున్నారు.

అవనిషాను పిల్లలు లేని తమకు స్వంత కూతురు అని ప్రకటించారు. ఆమెకు కావలసిన అన్ని సదుపాయాలు సమకూర్చి పెట్టారు. కంప్యూటర్‌ను కొనిపెట్టారు. తమ కుమార్తెగా దత్తత కూడా స్వీకరించారు. తల్లి, తండ్రి, సోదరిలను భూకంపంలో కోల్పోయి అనాథగా మిగిలిన ఆమెకు అండగా నిలిచారు.

ఏ సేవా దృక్పథంతో ముందుకు వచ్చారో దానిని నెరవేర్చారు.

* * *

సెప్టెంబర్ 6, 2003.

ముంబాయిలో అవని షా, జిగర్ రాజ్‌గౌర్ దంపతులుగా ఒకటయ్యారు. మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు సంస్థ ఉద్యోగులు పెళ్లికొడుకు తరఫున, పంకజ్ బంధువర్గం అంతా అవని షా తరఫున పెళ్ళి పెద్దలుగా హాజరయ్యారు.

జిగర్ తల్లిదండ్రులు మొదట ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. అంగవైకల్యం కలిగిన అమ్మాయితో వివాహం ఎందుకని నిరుత్సాహపరిచారు. అయినప్పటికీ పుణె ఆసుపత్రిలో జనించిన ప్రేమ వారి మధ్య వారధిని కట్టింది. ఎవరు ఏమన్నా, ఎందరో వద్దన్నా ఒకర్నొకరు ప్రేమించుకున్న వారిద్దరూ ఆనందంగా ఒకటి అయ్యారు.

పెళ్ళి ముగిసిపోయింది.

ఎవరి మట్టుకు వారు వెళ్ళిపోయారు.

కొత్త కోడలిని తీసుకువెళ్ళడానికి జిగర్ తల్లిదండ్రులు అయిష్టంగానే ముందుకు వచ్చారు. పంకజ్, జయబాల షా తమ దత్త పుత్రికను అత్తవారింటికి పంపించడానికి సిద్ధపడ్డారు.

భుజ్ వెళ్ళడానికి అలంకరించబడ్డ కారును సిద్ధం చేశారు. అవని షా నెమ్మదిగా నడుచుకుని కారు వద్దకి వచ్చింది. జిగర్ కారు తలుపు తెరిస్తే మెల్లగా ఎక్కి కూర్చుంది. పక్కన జిగర్ రాజ్‌గౌర్ కూర్చున్నాడు. కారు ముంబాయి నుంచి బయలుదేరింది.

* * *

మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ క్వార్టర్లు వరుసగా ఉన్నాయి. తమ ఇంటి మేడపైన జిగర్, అవని కుర్చీల్లో కూర్చున్నారు.

ఆకాశం నిర్మలంగా ఉంది సాయంసంధ్యలో మెరుస్తోంది. దూరంగా భుజ్ పట్టణంలో భవంతులు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానని అనుకోలేదు. నా వంటి జీవితానికి ఇటువంటి అదృష్టం లభిస్తుందని అనుకోలేదు!" అవని చెబుతోంది.

జిగర్ వింటున్నాడు.

"మన పెళ్ళి జరిగి వారం రోజులు మాత్రమే అయింది. ఇంకా ఎంతోకాలం మనం సహజీవనం చేయవలసి ఉంది. ఎందుకంత లోతుగా ఆలోచిస్తున్నావు... నీ మీద జాలితో పెళ్ళి చేసుకోలేదు. ప్రేమతో పెళ్ళాడాను. నువ్వు నా దేవతవి" జిగర్ నెమ్మదిగా చెప్పాడు.

అవని కుర్చీ జరుపుకుని మరింత దగ్గరికి వచ్చింది. భర్త భుజం మీద తలవాల్చి కళ్ళు మూసుకుంది. ఆమె పరిస్థితిని చూసి జిగర్ తల నిమురుతూ మరింత దగ్గరికి తీసుకున్నాడు. కొద్ది నిముషాలు వారి మధ్య మౌనమే రాజ్యమేలింది.

నాకు ఈ లోకంలో ఎవరూ లేరు... నన్ను కన్నవాళ్ళు లేరు... ప్రేమించేవారు లేరు... వంటరిగా వున్న నాకు గొప్ప అండగా మీరు లభించారు... నాకు ఈ జీవితం చాలు. భగవంతుడు కనిపిస్తే మిమ్మల్నే జన్మజన్మలకూ భర్తగా ఇవ్వమని కోరుకుంటాను.." అవని షా ఒక్కొక్క మాట కూడబలుక్కుని చెప్పింది. అలా చెబుతున్నప్పుడు ఆమె చెక్కిళ్ళ కదలిక జిగర్ గుండెల ఉఛ్వాస నిశ్వాసాలకు తగిలింది.. ఆ తర్వాత ఆమె కన్నీళ్ళు అతని షర్టును పూర్తిగా తడిపేశాయి.

జిగర్ ఆమెను మరింత పొదువుకున్నాడు.

"ఏయ్! ఏమిటిది చిన్నపిల్లలా... ఏడవకు, ఏడేడు జన్మలకు... నీతోనే కలిసి జీవిస్తానులే. నీ పేరు అవని... కాని నువ్వు నా జీవితంలో ప్రవేశించిన ఆమనివి... అంతే!"

ఆమె మరింత ఒదిగిపోయింది.

ఆకాశం నిర్మలంగా ఉంది. సంధ్య కిరణాలు పరావర్తనం చెంది ఆ ప్రాంతానికి కొత్త అందాలను సంతరించి పెడుతున్నాయి. నీలం రంగు ఆకాశం కుంకుమ రంగును పులుముకొంటోంది. ✦

బాధే సౌఖ్యమనే..

లక్ష్మి

హాయిగా నవ్వేస్తున్నంత మాత్రాన-

కులాసాగా వున్నామని ఎట్లా చెప్పగలం?

ఈతి బాధలు సవాలక్ష వుంటాయి!

వాటి మాటేమిటి?

అవి కూడా మనతో పాటే పెరిగి పెద్దవవుతూ వుంటాయి. అందుకని ఏడుస్తూ కూచుంటామా? అందుకు రూలు వప్పుకుంటుందా?

మరేం చేయాలి? వేదాంతి మాదిరి నవ్వుతూ బతకాలి!

ఆ టెక్నిక్కు చేతకాదనుకున్నప్పుడు - అమ్మలక్కలతో చెప్పుకుని గుండె బరువు అంతో ఇంతో తగ్గించుకోవాలి!

వాళ్ళ ఓదార్పు ద్వారా కొంతలో కొంత ఉపశమనం కలిగే ఛాన్సుంటుంది!

అయితే-

మన కష్టాల లిస్టు శ్రద్ధగా వినే అమ్మలక్కలు మనల్ని ఓదార్చి పుణ్యం కట్టుకుంటారనే గ్యారంటీ ఏముంది?

పీత కష్టాలు పీతవి అన్నారు పెద్దలు!

వాళ్ళ సొంత కష్టాలు గాలికొదిలేసి మనల్ని ఓదార్చే పని' పెట్టుకునేంత ఓపిక వాళ్ళకి వుండకపోవచ్చు!

పైగా-

వాళ్ళ సొంత కష్టాల్ని మన కష్టాల్తో పోల్చుకుంటారు!

వాళ్ళ కష్టాలు మనకష్టాల కంటే తక్కువ స్థాయిలో వుంటే కొంచెం తెప్పరిల్లుతారు! హెచ్చు స్థాయిలో వుంటే - మా గురించి ఎవరికి చెప్పుకోమని ముక్కు చీదుకుంటారు!

ఇంచుమించు-

అందరం ఒకే నావలో

కష్టాల కడలిలో ప్రయాణం చేస్తున్నాం!

అందువల్ల -

మనల్ని ప్రేమించే కష్టాల్ని మనం కూడా ప్రేమించడం నేర్చుకోవాలి. లేకపోతే సుఖంగా బతకలేం!

నా చిన్నతనంలో -

'దేవదాసు' సినీమాని చాలాసార్లు చూసేను. అందులో 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్' అనే పాట నన్ను బాగా ఆకర్షించింది! అది ఎంత గొప్ప పాట! కవిగారికి చేతులెత్తి మొక్కాలి!

బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్..

ఆ ఎరుకే నిశ్చలానందమోయ్..

బ్రహ్మానందమోయ్..

అని కవిగారు అలనాడెప్పుడో చెప్పనే చెప్పేరు. అప్పట్లో - పాడుకోడానికి బావుందని అనుకున్నానే గాని - ఆ పాటలో కవిగారు చెప్పిన జీవిత సత్యాన్ని అర్థం చేసుకోలేకపోయేను!

ఇప్పుడు నడుస్తున్న 'ఫీల్‌గుడ్' వ్యవహారం కవి వాక్కుని కాపీ కొడుతున్నందుకు ఆశ్చర్యపోతున్నాను!

అది సినీమా. అందులో సంఘటనలకు సూటయ్యే పాటలు కవులు రాస్తారు. ఇది జీవితం. అంతా బావుందనే ఏలికల సర్టిఫికెట్‌తో ఇక్కడి సమస్యలు తీరిపోతాయా?

ఏలికలు -

ఎప్పటికప్పుడు మాయమాటల్తో బూటకపు నినాదాల్తో దేశ ప్రజల్ని బుజ్జగించడం సదాచారంగా పాటిస్తున్నారు!

వాళ్ళందరూ నీరో చక్రవర్తికి వారసులు!

రోమ్‌నగరం తగలడిపోతుంటే - సదరు చక్రవర్తి ఫిడేలు వాయించుకుంటో ఆ దృశ్యాన్ని కులాసాగా తిలకించి పులకించి పోయేరుట! అదీ విషయం!

కష్టాలు -

కేవలం సగటు మనుషులకే పరిమితం కాలేదు.

ప్రభువులు కూడా దిక్కుమాలిన కష్టాలతో ఇబ్బంది పడుతూనే వుంటారు!

లిఫ్టులేని మేడ ఎక్కుతున్నప్పుడూ...

కారుండి డ్రైవరు లేనప్పుడూ

లాటి కష్టాలతో ప్రభువులు కన్నీరు పెట్టుకుంటారు. కష్టాలు ఎవర్నీ కనికరించవు!

అంచేత -

అంతా బాగుందనే ఉత్తుత్తి సమాచారంతో ఆందోళన పడటానికి స్వస్తి పలకాలి. ఏమీ బాగోలేదనే యదార్థ పరిస్థితికి అలవాటు పడి బతకాలి!

ఏదైనా 'అలవాటు' చేసుకోడంలోనే వుంటుంది!

కాదుకూడదనుకుంటే పుట్టగతులుండవు జాగ్రత్త!

ఫస్టువీక్‌లోనే నెలజీతం హుష్‌కాకి అయిపోవచ్చు. అంతమాత్రాన ఇంటో ఇల్లాలు డీలా పడిపోతే - ఆ ఇల్లు బాగుపడదు!

ఆమె నిత్యం పచ్చగా వుండటం అలవాటు చేసుకోవాలి!

పిల్లల చదువులూ ఆరోగ్యాలూ అధ్వానంగా వున్నాయని దిగులు పడకూడదు. అంతా బావుందనే భావన అలవాటు చేసుకోవాలి!

ఒకావిడ తన అరచేతిని జ్యోతిష్కుడి ముందుపెట్టి అడిగిందిట-

"నా కష్టాలు ఇంకా ఎన్నాళ్ళుంటాయో?"

"ఈ రేఖ ఇక్కడ బాగా వంకర తిరిగింది. గమనించేవా?"

"అవును! బాగానే వంకర తిరిగింది! వంకర తిరిగిందగ్గర్నించి సుఖంగా బతుకుతానా?"

"అని ఎవడన్నాడు? కష్టాలకు బాగా అలవాటు పడి వుండటం మూలంగా - ఇకముందు ఎన్నికష్టాలొచ్చినా నిబ్బరంగా బతుకుతావ్!"

ప్రస్తుతం మనం ఆ వంకర రేఖల్లోనే బతుకుతున్నామని చెప్పడం తప్ప - రేఖల్ని మార్చే విద్య నాకు తెలీదు! మన్నించండి! ✦

వామ్మో... ప్రజల వద్దకే వైద్యో... హరీ!

రుక్మిణి

"మనకు ప్రజల భాగస్వామ్యం... ఆరోగ్యం చాలా ముఖ్యం... ప్రజలు సల్లంగుండాలె - వాండ్లు పదికాలాల పాటు బతికి బట్టకడితేనే... పది ఓట్లు మనకేస్తారు...!"

ఆరోగ్యం మంత్రిగారి వివరణ అందరికీ బాగా నచ్చింది. ఎందుకంటే వస్తున్న ఎన్నికల సీజన్లో 'ఓటు' అన్నమాట అన్నిటికన్నా చాలా ప్రియమైంది గదా! అందులోనూ బీదాబిక్కి జనాల్ని ఆదుకున్నట్లు ఆకట్టుకోవడానికి ఏదో ఒక పథకం తయారు చేసుకోవాల్నాయె! అందుకని అందరూ ఆరోగ్యం మంత్రి గారికి తమ చెవుల్ని చాలా శ్రద్ధగా అప్పగించారు. దాంతో మంత్రి గారికీ హుషారొచ్చింది.

"మొన్నటికి మొన్న జూనియర్ డాక్టర్లు నెలా పదిహేన్రోజులు తమ ప్రతాపం చూపించి మనందరినీ గడగడలాడించారు. అసలు వాళ్ళంతా డాక్టర్లు కాదని నా అనుమానం..."

సభ్యుల్లో కలకలం చెలరేగింది. ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారాయె!

వాళ్ళంతా కచ్చితంగా మారువేషాల్లో వచ్చిన నక్సలైట్లో... మనమంటే గిట్టని విదేశీ గూఢచారులో అని నా అనుమానం! ఎందుకంటే వాళ్ళు అంతా డైరెక్టుగా 'రాజకీయం' చేసి జనాల్ని రెచ్చగొట్టారు.

సభ్యుల్లో తీవ్రమైన చర్చ మొదలయింది. ఈ నక్సలైట్లు దేనికైనా తెగిస్తారు... పోనీ మన రాజకీయ ప్రత్యర్థులు అనుకుంటే పోలా! ఎందుకంటే తీవ్రవాదులు అడవుల్లోనే గదా వుండేది! ఊహూ.... మరి విదేశీ ఏజంట్లూ... గూఢచారులూ అంటాడేంది....?

"మంత్రిగారూ అసలు మనం ఆదిలోనే అదుసుతొక్కాం... మన ప్రపంచ బ్యాంకు వారి నడిగి విదేశీ కన్సల్టెంటుల... విదేశీ సలహాల పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే అంతా బాగానే వుండేది". ఓ సహ సభ్యుడు చాలా ప్రశాంతంగా... ఆలోచించి మరీ తన అభిప్రాయాన్ని బయటపెట్టాడు.

"అంటే?" ఆయనగారి ఆలోచన అంతు బట్టక ఆరోగ్య మంత్రిగారు నోరువెళ్ళబెట్టి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏముందీ... మనకు మన ప్రజల ఆరోగ్యం ముఖ్యం గదా... మన యన్నారై వాళ్ళందరినీ... ఫారిన్ అమెరికా, బ్రిటన్ దేశాల పిల్లలతో మొత్తానికి మొత్తం మెడికల్ కాలేజీల సీట్లు కేటాయించి నింపి పార నూకితే పీడా పోయేది. వాళ్ళయితే బుద్ధిగా వుంటారు. ఈ సమ్మెలు... సత్యాగ్రహాలు... నిరసనల జోలికి పోరంటే పోరు...!"

తర్వాత సభ్యులందరూ తలలు పట్టుకున్నారు. చికాకు పడ్డారు.

"అసలీ సమస్యంతా వచ్చిపడింది ఆ జి.ఓ. 90తోనే గదా... మరి దాన్ని కాస్తంత మార్చిపడి చేస్తే పోలా!" ఒక సభ్యుడు తెలివిగా మెలిక పెట్టాడు.

"అందులోనూ యూజర్ ఛార్జీల గొడవా... కాలేజీ ఫీజుల మతలబేగా...!" మరో సభ్యుడు గొణిగాడు.

"అదేం కాదు... అసలు మన ఇష్టం వచ్చినట్లు మనం తలా ఒక మెడికల్ కాలేజీ పెట్టకోడానికి మనకు హక్కుంది. దాన్ని కాదనడానికి వాళ్ళెవరు? దాన్లో ఫీజులు మనిష్టం! కట్టగలిగినోడే చదువుకుంటాడు... ఫారినోడైనా... ఇంపోర్టు సరుకైనా.... నేటివోడు అయినా ఎంతఫీజు కట్టమంటే అంత కట్టి బుద్ధిగా చదువుకోవాల్సిందే... ఆ!...!" నాలుగైదు మెడికల్ కాలేజీలు.. ఒక డెంటల్ కాలేజీ వున్న ఒక మంత్రివర్గ సభ్యుడు తొడ లపలప చరిచి అన్నాడు. మళ్ళీ సభ్యులందరూ తలలు పట్టుకున్నారు.



"అందుకే వీటన్నిటి నీ వదిలించుకోడానికే మనం 'ప్రజల వద్దకే వైద్యులు' పథకం ప్రారంభిస్తే బాగుంటుందనుకుంటున్నాం. ముందుగా దాని వివరాలు చెప్తా వినండి!" ఆరోగ్య మంత్రిగారు ఉత్సాహపడి తన వినూత్న పథకంలోని ప్రయోజనాలను వివరించడానికి తయారైపోయాడు.

"ఈ జి.ఓ. 90 దెబ్బకి మన గవర్నమెంటు ఆసుపత్రులకు రావడానికి... ఒళ్ళు చూపించుకుని రోగాలను నయం చేయించుకోవడానికి జనం బాగా బెదిరిపోతున్నారు. ప్రతిదానికీ లంకెపెట్టి ఫీజులు కక్కమంటున్నాం. ఏదో ఒక టెస్టు చేసి పారేసి డబ్బులు గుంజుడేనాయె. ఈ డబ్బులు కట్టలేక జనాలు గవర్నమెంటు ఆసుపత్రంటే హడలి చస్తున్నారు."

అందరూ అవున వునని తలకాయ లూపారు.

"మరి వాళ్ళట్లా జ్వరాలతో... విరిగిన కాళ్ళతో... వాంతులు విరేచనాలతో విషజ్వరాలతో గుడిసెల్లో కుక్కిమంచాల మీదా... చింకి చాపల మీదా పడి 'హరీ' మంటే ఎవరికి నష్టం? మనకే!"

అందరూ అవాక్కయ్యారు. చాలా ఓట్లు తగ్గిపోతాయి. అసలే తాము చేర్పించిన బోగస్ ఓట్లను ఏరిపారేసి ఓటు బ్యాంకంతటినీ గత్తర చేసిపారేసిరి. ఇదేదో బాగా ఆలోచించాల్సిన విషయమే!

"అందుకనీ... మనం 'ఆరోగ్య కార్యకర్తల్ని' కంట్రాక్టు పద్ధతిన రిక్రూటు చేసుకుంటామన్న మాట...

"అంటే మళ్ళీ జూనియర్ డాక్టర్లా!" ఓ సభ్యుడు హడలిపోతూ అన్నాడు.

"ఛ.. ఛ. వుత్త వాలంటీర్లన్నమాట... డాక్టర్లు కాదు... లక్షల మంది నిరుద్యోగులున్నారు. వాళ్ళందరికీ అట్లా పదో పరకో ఇచ్చి 'మెడికల్ వలంటీర్' బృందాలను తయారు చేసుకుంటాం. ఫక్తు మన విద్యావలంటీర్ల టైపులో అన్నమాట! వాళ్ళేం చేస్తారూ... కాగితం కలం పుచ్చుకుని, ఓటర్ల జాబితా అందుకుని పాలోమని ఇంటింటికీ... గుడిసె గుడిసెకీ తిరిగి 'సర్వే' మొదలుపెడతారు..

"సర్వేలేంది మహాప్రభో..." బితుకు బితుకుమంటూ మరో సభ్యుడు గొణిగాడు. "అంటే - ఆరోగ్య కార్యకర్త ప్రతి ఇంటికీ తిరిగీ, పేర్లు... వివరాలు సేకరిస్తాడు. ఆ ఇంట్లో దగ్గుతో బాధపడేదెవడు... దీర్ఘరోగాలతో కుళ్ళిపోయేదెవడు... వాంతులెవరికి? విషజ్వరాల మతలబు... టైఫాయిడెంతమందికి? డెంగ్యూ ఎవరికి? మలేరియా ఎందరికి?"

అంతా శ్రద్ధగా వింటున్నారు... ఇదేదో బాగానే వుంది... దీంతో ఓటర్లను స్వయంగా కలిసి వూదరపెట్టడానికి మాంచి పథకమే తయారు చేస్తున్నారు మరి!

"ఇక ఆఖర్న అసలైన ఘట్టం వుంటుంది. మనం ప్రతిరోగానికీ... దాని తీవ్రతను బట్టి రకాన్ని బట్టి... గ్రేడులను నిర్ణయిస్తామన్నమాట... అంటే జ్వరం వుందనుకో... అది వాడికి ఎంతకాలం నుండి వుంటుందీ... ఎన్ని డిగ్రీలు... అట్లా.. దాంతర్వాత అసలు పాయింటు దాని గ్రేడును బట్టి దానికి ఇన్ని రూపాయలు... ఇంత రుసుం... ఇంత పెనాల్టీ అని వసూలు చేస్తాం... రసీదు రాసి - పర్రున చించి వాళ్ళకందిస్తాం - అంటే - ఆ రోగం వచ్చి అన్ని రోజులైనా వాడెందుకు ఆసుపత్రికి రాలేదు... డాక్టరుకెందుకు చూపించుకోలేదు... మందులెందుకు వాడడం లేదు... అట్లా వాడకపోవడం... రాకపోవడం సామాజిక నేరంగా పరిగణించి వాళ్ళకు ఛార్జీలు వడ్డిస్తాం...

అప్పటికి సభ్యులు కొందరు హాహాకారాలు చేశారు.

"ప్రజల్లో ఆరోగ్యం పట్ల" సామాజిక అవగాహన పెరుగుతుంది. గుడ్ గవర్నెన్స్ పట్ల అవగాహన ఏర్పడుతుంది. ఈ మొదటి విడత దెబ్బకు జనం రెండోసారి విధిగా గవర్నమెంటు ఆసుపత్రులకు వచ్చి చొక్కావిప్పేదీసి, పరీక్షలు చేయించుకుంటారు. మరింక అట్లా ప్రజలు ఎగబడి ఆసుపత్రులకు వచ్చేస్తుంటే... జూనియర్ డాక్టర్లనెవడు మద్దతిస్తాడు.

దాంతో దాదాపు సభ్యులందరూ హఠాత్తుగా మూర్ఛలోకి జారుకున్నారు. ✦

మన శరీరంలోని మూత్రపిండాలు (కిడ్నీలు),మూత్ర నాళికలు (యురెటర్స్), మూత్రాశయం (యురినరీ బ్లాడర్) మూత్రనాళం (యురిత్ర) ప్రత్యుత్పత్తి అవయవాలు మొదలైన వాటి విధులు, వ్యాధులు, చికిత్స సంబంధ అధ్యయన శాస్త్రాన్ని 'యురాలజి' అంటారు. సుమారు నలభై సంవత్సరాల క్రితమే యురాలజి జనరల్ సర్జరీ నుంచి ఒక ప్రత్యేక విభాగంగా రూపుదిద్దుకుంది.

స్పెషలిస్టులను సంప్రదించడం మంచిది

మూత్రకోశ వ్యాధులు

డా॥ కె.ఎస్.ఎన్. చారి ఎం.ఎస్., ఎం.సిహెచ్.

? సాధారణ యురాలజి సంబంధ వ్యాధులేమిటి?

మన శరీరంలో మొత్తం, సర్జరీలకు సంబంధించిన వ్యాధులలో 30-40 శాతం యురాలజీకి సంబంధించినవే వుంటున్నాయి. వీటిలో కూడా అధిక శాతం వ్యాధులకు శస్త్ర చికిత్స అవసరమవుతుంది. యురాలజి సంబంధ వ్యాధులను ముఖ్యంగా (ఎ) చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులు (బి) పెద్దలలో వచ్చే వ్యాధులు. (సి) స్త్రీలలో వచ్చే వ్యాధులుగా విభజించవచ్చును. చిన్నపిల్లల్లో కనబడే వ్యాధులలో పుట్టుకతో వచ్చే వ్యాధులు పేర్కొనదగినవి. 1. హైపోస్పాడియాసిస్ (మూత్రద్వారం వుండవలసిన చోట వుండకుండ, కొంచెం పై భాగంలో వుండడం,) మెగా యురేటర్ (పుట్టుకతోనే మూత్రనాళికలు చాలా లావుగా వుండడం) పోస్ట్ యురెత్రల్ వాల్వులు వివిధ రకాల ట్యూమర్లు ముఖ్యమైనవి. ఇంకా చిన్న పిల్లల్లో మూత్ర పిండాల్లో, నాళికల్లో, మూత్రాశయంలో రాళ్ళు కూడా ఏర్పడుతుంటాయి. పెద్దలలో సాధారణంగా వచ్చే వ్యాధుల స్ట్రిక్చర్ యురెత్రా (మూత్రనాళం అసాధారణంగా ఒక ప్రదేశంలో కుంచించుకుపోయి మూత్ర ప్రవాహానికి అవరోధం కలిగించడం) ప్రోస్టేట్ గ్రంథి పెద్దదవడం (బిపిహెచ్), మూత్రపిండాల క్యాన్సర్, యురినరీ బ్లాడర్ క్యాన్సర్, మూత్రపిండ క్షయ, (టి.బి) ప్రోస్టేట్ క్యాన్సర్, నెఫ్రైటిస్, యురెత్రైటిస్ మొదలైన వ్యాధులు పేర్కొనదగినవి.

స్త్రీలల్లో ప్రత్యేకంగా కనబడే వ్యాధులలో వెసైకో వేజైనల్ ఫిస్టులా యురినరీ ట్రాక్ఇన్‌ఫెక్షన్‌లు మొదలైనవి.

? ఈ వ్యాధులకు కారణాలేమిటి?

పుట్టుకతో వచ్చే యురాలజి సంబంధ వ్యాధులకు కారణాలు ఇవి అని ఇదమిద్ధంగా చెప్పడం సాధ్యం కావడం లేదు. పెద్దలలో వచ్చే సిర్చర్ యురెత్రాకు, యుక్త వయసులో గనేరియా సుఖవ్యాధికి గురికావడం, యాక్సిడెంట్లు, వివిధ పొట్టకు సంబంధించిన ఆపరేషన్లలో పొరపాట్లు, యురెత్రోస్కోపివంటి పరీక్షలు చేయడంలో జాగ్రత్త వహించకపోవడం, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ కారణమవుతున్నాయి. మూత్రపిండ క్షయ వ్యాధి రక్తం ద్వారా వ్యాపిస్తోంది. స్త్రీలలో వచ్చే వ్యాధులకు ప్రసవ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడం ప్రధాన కారణం.



? యూరాలజి సంబంధ వ్యాధుల ప్రత్యేక లక్షణాలేమిటి?

చిన్న పిల్లలు తరచూ మూత్ర విసర్జన సమయంలో 'మంట' పుడుతోందని కంప్లెయింట్ చేస్తుంటే, అది ముఖ్యంగా పుట్టుకతో వచ్చిన యురాలజి సంబంధ వ్యాధి లక్షణం కావచ్చును. నడుము క్రింది భాగంలో ఇరుప్రక్కల (రీనల్ యాంగిల్) సడెన్‌గా తీవ్రమైన నొప్పి ప్రారంభమయి, కిందికి పాకుతూ మూత్రనాళాల్ని చేరడం, మూత్రపిండాల్లో రాళ్ళు ఉండడంవల్ల వచ్చే లక్షణం కావచ్చును. కొందరిలో వాంతులు, తీవ్రంగా చమట పట్టడం, పల్స్ వేగం పెరిగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మూత్రవిసర్జన కంట్రోల్‌లో లేకపోవడం, పొట్ట ఉబ్బరించినట్లుండడం, మూత్రాశయంలో మూత్రం నిలిచిపోయి వుండడం, మూత్రం ఇన్‌ఫెక్షన్‌కు గురికావడం, తరచూ మూత్ర విసర్జన సమయంలో మంట అనిపించడం, నపుంసకత్వం, మూత్రం ధారగా కారిపోవడం, అసలు యూరిన్ విసర్జించలేకపోవడం, మహిళల్లో మూత్రం మూత్రంద్వారంతో పాటు యోని ద్వారా కూడా విసర్జించబడుతుండడం, నవ్వినప్పుడు, దగ్గినప్పుడు తెలియకుండానే మూత్రం విసర్జించబడడం, మూత్రంలో రక్తం ఏర్పడడం ఎన్నో ప్రత్యేక లక్షణాలు యురాలజి సంబంధ వ్యాధులలో కనిపిస్తాయి.

? వెసైకో వెజైనల్ ఫిస్టులా (వి.వి.ఎఫ్) అంటే ఏమిటి? వివరంగా తెలియజేస్తారా?

ఇది సాధారణంగా స్త్రీలలో కనబడే యురాలజి, గైనకాలజీలకు సంబంధించిన వ్యాధి. మూత్రనాళానికి (యురిత్రాకు), యోనికి మధ్య రంధ్రం ఏర్పడి, దీని ద్వారా మూత్రనాళంలోని కొంత మూత్రం యోనిలోకి ప్రవేశించడాన్నే 'వి.వి.ఎఫ్'. అంటారు. దీనికి ప్రధానకారణం, గర్భిణీ స్త్రీల ప్రసవ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే. నొప్పులు ప్రారంభమయ్యాక, చాలా సేపు ప్రసవించకపోవడాన్ని అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యుని సంప్రదించాలి. ఒక్కోసారి ఆపరేషన్ సమయంలో పొరపాట్లు, అజాగ్రత్త వల్ల కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశాలున్నాయి. కనుక నిపుణులైన వైద్యుల్ని సంప్రదించడం అన్ని విధాలా శ్రేయస్కరం.

? మూత్ర పిండాల్లో రాళ్ళు ఎలా ఏర్పడతాయి ? వీటి గురించి వివరిస్తారా?

బియ్యంలోని రాళ్ళు పొరపాటున తినడంవల్ల మూత్రపిండాల్లో రాళ్ళు ఏర్పడుతున్నాయనే అపోహ చాలామందిలో వుంది. అసలు మనం తీసుకునే ఆహారంలోని రాళ్ళకు, మూత్రపిండాలలోని రాళ్లకు ఎలాంటి సంబంధం లేదు. శరీరంలో ఉన్న మూత్రపిండ వ్యవస్థలోని లోపాలు రాళ్ళు ఏర్పడడానికి ఒక్కొక్కరిలో ఒక్కోరకమైన కారణాలు కనబడుతుంటాయి. కొందరిలో హార్మోనులు



ముఖ్యంగా పారాథార్మోన్ పరిణామంలోని తేడాలు రాళ్ళు ఏర్పడడానికి దారితీస్తున్నాయి. మరికొందరిలో విటమిన్-ఎ లోపం, కాల్షియం ఎక్కువ తీసుకోవడం, మూత్రపిండ సంబంధం ఇన్ఫెక్షన్‌లు, మూత్రం ఎక్కువకాలం నిల్వ వుండడం (ముఖ్యంగా పక్షవాతానికి గురైన రోగుల్లో ఇది సాధారణంగా జరుగుతుంది), బిపిహెచ్ స్ట్రిక్చర్ యురెత్రా కేసుల్లోను, మూత్రపిండాల్లోరాళ్ళు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా వుంటున్నాయి. వీటిలో కాల్షియం ఆక్సలేట్ రాళ్ళు, కాల్షియం ఫాస్ఫేటు రాళ్ళు, యూరిక్ ఆమ్లపు రాళ్ల మొదలయిన రకాల రాళ్ళు పేర్కొనదగినవి. తగినంత మంచి నీరు తీసుకోకపోవడం కూడా రాళ్ళు ఏర్పడడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చును. ఈ రాళ్ళు 50 శాతం మందిలో 30-35 సంవత్సరాల మధ్య వయస్కుల్లో కనిపిస్తున్నాయి. స్త్రీలలోకంటే పురుషుల్లో మూత్రపిండాల్లో రాళ్ళు ఎక్కువగా ఏర్పడుతున్నాయి.

? బి.పి.హెచ్. అంటే ఏమిటి? ఎలా వస్తుంది.

ఇది వయస్సు మళ్లిన పురుషుల్లో కనిపించే వ్యాధి. 65 సంవత్సరాలు దాటిన వారిలో కనిపిస్తున్న అతి సాధారణ వ్యాధి. అయితే మనదేశంలో ఈ వ్యాధి 55 సంవత్సరాల వయస్కుల్లోనే కనబడుతోంది. మూత్ర నాళంలో కొంతభాగాన్ని ప్రొస్టేట్ గ్రంధి చుట్టి వుంటుంది. ఈ గ్రంధి అసాధారణ పెరుగుదల వల్ల మూత్రనాళంలో ఆ భాగం ముడుచుకుపోయి మార్గం ఇరుకైపోతుంది. కొందరిలో గ్రంధి పెరగడం వల్ల మార్గం పూర్తిగా మూసుకుపోయి మూత్రవిసర్జనకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. దీనినే 'బినైన్ ప్రొస్టేటిక్ హైపర్‌ట్రోఫి' లేదా బిఇపి హెచ్ అంటారు. దీనికి కారణాలు కచ్చితంగా తెలియనప్పటికీ, వయస్సు మళ్లినవారిలో సాధారణంగా వచ్చే ఈస్ట్రోజెన్, టెస్టోస్టిరాన్ వంటి హార్మోనుల సమతుల్యతలో మార్పులు కొంతవరకు కారణం కావచ్చునని తెలుస్తున్నది. కొందరిలో ఏ కారణం లేకుండానే గ్రంధి పెరుగుతుంది. ప్రారంభ దశలో రాత్రిళ్ళు ప్రతి పది నిమిషాలకు మూత్ర విసర్జన చేయాలనిపించడం, మూత్రం కంట్రోల్ తప్పి బొట్లుబొట్లుగా పడిపోవడం, దార సరిగ్గా రాకపోవడం, చివరకు అసలు మూత్రం విసర్జించలేకపోవడం వంటి లక్షణాలుంటాయి. ఇంకొందరిలో నపుంసకత్వం వస్తుంది.

? ఆధునిక వ్యాధి నిర్ధారణా పరీక్షలేమిటి?

మూత్ర పరీక్ష, రక్తపరీక్ష, సాధారణ ఎక్స్‌రే పరీక్షలతో పాటు నేడు చాలా ఆధునిక పరీక్షలు యురాలజి రోగులకు లభ్యమవుతున్నాయి. ఫైబర్ ఆప్టిక్ ఎండోస్కోప్‌లు వచ్చిన తర్వాత నిర్ధారణ పరీక్షలు చాలా సులభమయ్యాయి. ప్రత్యేక పరీక్షల్లో రక్తంలోకి మందు ఎక్కించి చేసే ఇంట్రావీనస్ పైలో గ్రామ (ఐ.వి.పి) యురెత్రోగ్రఫీ, యురెత్రోస్కోపి, సిస్టోస్కోపి, ఎంజియోగ్రఫీ, యురేటరోస్కోపి, అల్ట్రాసౌండ్, సిటి స్కాన్, ఎం.ఆర్.ఐ, (మాగ్నేటిక్ రెజొనెన్స్ ఇమేజ్) బయాప్సి మొదలైన ఆధునిక నిర్ధారణ పరీక్షలు పేర్కొనదగినవి.

? వ్యాధుల చికిత్సలో అందరికీ అందుబాటులో వున్న అత్యాధునిక పద్ధతులేవిటి? వివరంగా తెలియజేస్తారా?

నిజానికి యురాలజి వ్యాధులకు సంబంధించిన శస్త్రచికిత్సలు చాలా సున్నితమైనవి. కష్ట, క్లిష్టతరమైనవి కూడా. అందుకనే యురాలజి సంబంధ వ్యాధుల్లో నిపుణులైనవారినే సంప్రదించడం చాలా అవసరం. చిన్న పిల్లల్లో కనిపించే హైపోస్పాడియాస్, పోస్టీరియర్ యురెత్రల్ వాల్వులు మొదలయినవాటిని శస్త్రచికిత్స ద్వారా సరిచేయవచ్చును. అయితే శస్త్రచికిత్సను రెండు దశల్లో రెండు దఫాలుగా చేయాల్సి వుంటుంది. ఇక మూత్ర పిండాలలో రాళ్ళను తొలగించడానికి, ఆపరేషన్ లేకుండానే, ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లిథోట్రిప్సి (ఎ.ఎస్.డబ్ల్యు.ఎల్) అనే పద్ధతి నేడు అందుబాటులోకి వచ్చింది. బిపి హెచ్‌ను ఆపరేషన్‌చేసి సురక్షితంగా తొలగించవచ్చును. ఇందులో ఐదు పద్ధతులున్నప్పటికీ టి.యు.ఆర్.పి. పద్ధతిని యురాలజిస్టులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వి.వి.ఎఫ్‌ను సర్జరీ ద్వారా మూసేయవచ్చును. ఇలా 99 శాతం వ్యాధులకు సంతృప్తికరమైన చికిత్సను నేటి యురాలజిస్టులు అందించగలుగుతున్నారు అని వేరే చెప్పనక్కర్లేదు.

? మూత్రం ఆగిపోవడం, మూత్రాన్ని ఆపుకోలేక పోవడం గురించి చెప్తారా?

మూత్రం పూర్తిగా నిలిచిపోవడాన్ని రిటెన్షన్ ఆఫ్ యూరిన్ అని, మూత్ర విసర్జన కంట్రోల్‌లో లేకపోవడాన్ని ఇన్‌కాంటినెన్స్ ఆఫ్ యూరిన్ అని అంటారు. ఈ రెండు కూడా యురాలజి సంబంధ వ్యాధుల ప్రధాన లక్షణాలే. కాని ప్రత్యేకమైన వ్యాధులు కావు. బిపి హెచ్., యురెత్రల్ స్ట్రిక్చర్, ప్రొస్టేట్ క్యాన్సర్, ఇన్ఫెక్షన్లు, స్త్రీలలో సర్వీక్సు క్యాన్సర్. వి.వి.ఎఫ్., స్ఫింక్టర్లు వీక్ కావడం థైరోటాక్సికోసిస్ (రక్తంలో థైరాయిడ్ హార్మోను పెరిగిపోవడం) మూత్రాశయంలో రాళ్ళు మొదలయిన వ్యాధుల్లో ఈ లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయి. వ్యాధి మూలాన్ని కనుక్కొని చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చును. వెన్నుపాముకు (స్పైనల్ కార్డుకు) దెబ్బ తగలడం వల్ల కూడా ఇవి రావచ్చును. దీనినే 'న్యూరోజెనిక్ ఇన్‌కాంటినెన్స్' అంటారు. ఇంకా స్త్రీలలో 'హిస్టీరియా' వంటి సైకలాజికల్ ప్రాబ్లమ్స్‌లో కూడా ఇన్‌కాంటినెన్స్ వుండవచ్చును.

? పక్కలో పిల్లలు మూత్ర విసర్జన ఎందుకు చేస్తారు? వివరిస్తారా?

చిన్నపిల్లలు రాత్రిళ్ళు పక్క తడుపుతుంటారు. దీనినే నాక్టర్నల్ ఎనురిస్ అంటారు. వీరిలో స్పష్టమైన వ్యాధి ఏదీ కనిపించదు. ఇదొకరకమైన సైకలాజికల్ ప్రాబ్లమ్‌గానే చెప్పుకోవచ్చును. శిక్షణ ఇవ్వడంద్వారా, కొన్ని రకాల మందుల ద్వారా చికిత్స చేయవచ్చును. ఇంకా యాక్సిడెంట్లు జరిగినప్పుడు, దెబ్బలు తగలడంవల్ల చాలామందిలో పై రెండు లక్షణాలు సాధారణంగా కనిపిస్తుంటాయి. కనుక వెంటనే సరైన నిపుణుని సంప్రదించాలి.

? మూత్రపిండాల మార్పిడి అంటే ఏమిటి? ఎలా చేస్తారు?

రెండు మూత్రపిండాలు పూర్తిగా చెడిపోయిన రోగికి, మరొకరి ఆరోగ్యవంతమైన మూత్రపిండాన్ని అమర్చడాన్నే మూత్రపిండమార్పిడి అంటారు. ఇక్కడ రోగిలో చెడిపోయిన మూత్రపిండాలను తొలగించరు. కొత్తగా మూడో మూత్రపిండాన్ని ఇలియాక్‌ఫోసాలో అమర్చి రక్తనాళాలకు, మూత్రనాళాలకు కనెక్షన్‌లు ఏర్పాటుచేస్తారు. యురాలజిస్టులతోపాటు, నెఫ్రాలజిస్టులు ప్రధానపాత్ర వహించే ఈ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్స తక్కువ ఖర్చులోనే హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో మనరాష్ట్రంలోనే లభ్యమవుతున్నది. ఈ శస్త్రచికిత్స చాలామందిలో మంచి ఫలితాలను యిచ్చి జీవితకాలాన్ని పొడిగిస్తున్నది.

? యురాలజి సంబంధ వ్యాధులు రాకుండా నియంత్రించుకునే మార్గాలేమైనా వున్నాయా?

కొన్ని వ్యాధులను, ముఖ్యంగా చిన్నపిల్లల్లోవచ్చే హైపోస్పాడియాస్ వంటివి నియంత్రించడానికి మార్గాలేమీ లేవు. అలానే బిపిహెచ్ విషయంలో కూడా రాకముందు ప్రత్యేకంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలేమీ కనబడడంలేదు. అయితే మిగతా యురాలజి సంబంధ వ్యాధులను కొన్ని ముందు జాగ్రత్త చర్యల ద్వారా నిరోధించే అవకాశాలున్నాయి. యువకుల్లో గనేరియా సోకితే సరైన సంపూర్ణ చికిత్స పొందితే స్ట్రిక్చర్ యురెత్రా రాకపోవచ్చును. అలానే గర్భిణీ స్త్రీలు ప్రసవాన్ని అశ్రద్ధ చేయకుండా ప్రసవించడం కష్టమైనప్పుడు వెంటనే నిపుణులైన వైద్యుల్ని సంప్రదిస్తే వివిఎఫ్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. మూత్రపిండాలు, మూత్రాశయం ఇన్ఫెక్షన్‌కు గురి అయినప్పుడు, సరైన యాంటిబయాటిక్‌తో చికిత్స పొందడం ద్వారా, అధికంగా మంచినీటిని తీసుకోవడం ద్వారా, కాల్షియంను అవసరానికి మించి తీసుకోకుండా ఉండడంద్వారా, థైరోటాక్సికోసిస్, పారా థైరాయిడిజమ్‌లను నిరోధించడం ద్వారా మూత్రపిండాలలో, మూత్రాశయంలో రాళ్ళు ఏర్పడకుండా చేసుకోవచ్చును. ఇంకా టాన్సిల్స్, పిప్పిపళ్ళు, క్షయ వంటి వ్యాధుల్ని, వివిధరకాల కిడ్నీ మూత్రాశయ సంబంధ క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందడం ద్వారా ప్రమాదకరమైన యురాలజీ సంబంధ వ్యాధులను నియంత్రించే అవకాశాలున్నాయి. ఏది ఏమైనా 'వ్యాధి చికిత్సకంటే నివారణ అత్యంత శ్రేయస్కరం' అన్న నిజాన్ని గుర్తుంచుకొని మెలగడం మంచిది. ✦

చక్కటి అవగాహన కల్గించే గ్రంథం

మానవ శరీరం ఒక కంప్యూటర్ వంటిది. అనేక విడిభాగాల సమ్మేళనంతో కంప్యూటర్ తయారైనట్లే మన శరీరం కూడా అనేక అవయవాల కలయికగా ఉంది. మన శరీరంలోని అవయవాలన్నీ సంయమనంతో చక్కగా సహకరించుకున్నంత కాలం మనం ఆరోగ్యంగా, ఆనందంగా జీవితాన్ని గడపగలుగుతాము. ఏ అవయవం సరిగా పనిచేయకపోయినా లేనిపోని ఇబ్బందులు వచ్చేస్తాయి. ప్రతి అవయవానికీ ఒక ప్రత్యేకమైన పని ఉంటుంది. ఆ అవయవం ఆ పనిని సక్రమంగా చేస్తేనే మన పని సక్రమంగా, సజావుగా ఉంటుంది.



మానవ శరీర నిర్మాణం – ముఖ్య అవయవాల పాత్ర, రచన: డాక్టర్ సమరం, వెల: రూ. 160, ప్రచురణ: నవభారత్ బుక్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ.

మనలో చాలా మందికి మన అవయవాల గురించిన అవగాహన ఉండదు. మన శరీరాన్ని గురించిన అవగాహన ఉంటే ప్రతి అవయవాన్ని ప్రత్యేక శ్రద్ధతో చూసుకోగలుగుతాము. అవయవాలు ఎందుకు వ్యాధిగ్రస్థమవుతాయో అవగాహన ఉన్నప్పుడు మాత్రమే మనం ఆ విధమైన శ్రద్ధ తీసుకోగలుగుతాము. ఈ అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అవి ఎందుకు వ్యాధిగ్రస్థమవుతాయో అర్థంచేసుకోగలుగుతాము.

ప్రతి వారికి తమ ఆరోగ్యాన్ని గురించి అవగాహన కల్గించడంలో డాక్టర్ సమరం విశేషమైన కృషి చేస్తున్నారు. ఆ దిశగా ఆయన అనేక వైద్య విషయాలను, ఆరోగ్య విషయాలను చక్కటి సులభమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో అనేక పుస్తకాలను వెలువరించారు. ఆ పరంపరలో భాగంగా ఈ మధ్య కాలంలో వెలువడిందే 'మానవ శరీర నిర్మాణం – ముఖ్య అవయవాల పాత్ర' అనే పుస్తకం.

ఈ గ్రంథంలో రచయిత మానవ శరీరంలోని ముఖ్య అవయవాలను ఎంపిక చేసుకొన్నారు. ప్రతి అవయవానికి ఒక అధ్యాయాన్ని కేటాయించి దాని నిర్మాణాన్ని గురించి వివరించారు. అందులోనే ఆ అవయవానికి వచ్చే జబ్బులు, వాటిని ఏవిధంగా గుర్తించాలి, నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రతి అవయవానికి వచ్చే చిన్న చిన్న అనారోగ్యాలను గురించి కూడా ఇందులో పొందు పరిచారు. ఆయా జబ్బులు రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలను కూడా సూచించారు.

ఇది ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగపడే పుస్తకం అనడంలో అతిశయోక్తి లేదు. ఇది గృహ గ్రంథాలయంలో తప్పకుండా ఉండదగిన పుస్తకం. పుస్తకం ధర కూడా మరీ ఎక్కువేమీ కాదు. ఇందులో ప్రతి అవయవానికి సంబంధించిన భాగాలను చిత్రాల రూపంలో కూడా పొందు పరిచారు. ఆ చిత్రాల ద్వారా మనం ఆయా అవయవాల నిర్మాణాన్ని తెలుసుకోవడానికి సులభంగా ఉంది. ఈ రోజుల్లో వెలువడుతున్న పుస్తకాలలో కొద్దో గొప్పో కనిపిస్తున్న అక్షర దోషాలు ఇందులో కూడా కన్పిస్తాయి. వాటిని కూడా ఇంకొంచెం జాగ్రత్తగా సరిచేసుకొని ఉండే ఇంకా బాగుండేది. మొత్తంగా చూసినప్పుడు మాత్రం డాక్టర్ సమరం ఏ ఉద్దేశంతో దీనిని వెలువరించారో ఆ ఉద్దేశం నెరవేరిందనే చెప్ప వచ్చు. ఇలాంటి సులభశైలిలో ఆయన కలం నుంచి మరిన్ని మంచి ఆరోగ్య గ్రంథాలు వెలువడాలని ఆశిద్దాం.

- సింహాద్రి సరోజిని

శ్రీకారం



THE WAGES OF IMPUNITY
Power, Justice and Human Rights
Written by : K.G.Kannabiran;
Price : 550/-;
Publishers : Orient Longman Private Limited 1/24, Asaf Ali Road, New Delhi.



సరదా సరదా చదువు
సంకలనం : వి.బాలసుబ్రహ్మణ్యం
వెల : రు. 15/–లు ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఎన్నికల కరదీపిక 'తెలుగుతీర్పు'



తెలుగు తీర్పు:ఏభై ఏళ్ళ రాజకీయ విశ్లేషణ (1952– 2002)
రచయిత : కొమ్మినేని శ్రీనివాసరావు
పేజీలు : 363, వెల : రు. 200లు
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఇటీవలి కాలంలో తెలుగు పుస్తకాల ప్రచురణ పెరిగింది. ఇది సంతోషించదగ్గ పరిణామమే కానీ దీనిలో 'వాసి' ఉన్న పుస్తకాలు తక్కువే అని చెప్పవచ్చు. అందులోనూ పదికాలాల పాటు ఉపయోగించదగ్గ 'ఆచూకి (Reference)'కి ఉపకరించే పుస్తకాలు చాల అరుదుగా వస్తున్నాయి. ఇలాంటి అరుదైన ఉపకరించే పుస్తకమే ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'తెలుగు తీర్పు : ఏభై ఏళ్ళ రాజకీయ విశ్లేషణ'.

ఎన్నికల గురించి తెలుగులో మంచి పుస్తకాలు దాదాపు లేవనే చెప్పవచ్చు. ప్రభుత్వం ప్రచురించే ఎన్నికల ఫలితాలు తప్పితే ఇతరత్రా విషయాలు తెలియజెప్పే పుస్తకాలు లేవు. ఇంగ్లీషులో ఒకటి రెండు ఉన్నా వాటిలో కూడా ముఖ్యంగా రాష్ట్రానికి సంబంధించిన సమాచారమిచ్చేవి లేవు. ఈ నేపథ్యంలో వచ్చిన ఈ పుస్తకం రాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన సమగ్ర విషయాలను చర్చించింది. 1952 నుంచీ 2002వరకూ అంటే తొలి ఎన్నికల నుంచీ తాజా ఎన్నికల వరకూ రాష్ట్రంలోని 294 అసెంబ్లీ నియోజక వర్గాలు, 42 లోక్‌సభ నియోజక వర్గాలకు చెందిన ఎన్నికల గణాంకాలను అన్ని రకాల విశ్లేషణలనూ కలిగి ఉంది. దీనితో పాటు విధాన సభ విషయాలను కూడా ఇందులో పొందుపరిచారు.

కేవలం నియోజక వర్గాల విశ్లేషణలే కాకుండా రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులు, ప్రధాన మంత్రులు దగ్గర నుంచీ గవర్నర్లు, శాసన సభలో ప్రతిపక్ష నాయకుల వరకూ సంపూర్ణ వివరాలనిచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారు, ఎక్కువ సార్లు ఎన్నికల్లో గెలుపొంది రికార్డులు సృష్టించిన వారు, మహిళా ప్రతినిధులు ఇలా అన్ని రకాల సమాచారాన్ని పొందుపరిచారు.

ఎం.ఫిల్, పిహెచ్.డి.లు కొరకు సమర్పించే 'థీసిస్' కన్నా కూడా రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ఎక్కువ వివరాలను ఈ పుస్తకం అందించిందంటే అతిశయోక్తి కాదు. శ్రమ కోర్చి సమాచారాన్ని క్రోడీకరించి అవసరమైన రీతిలో పొందుపరిచిన రచయితను, దానిని మనకందించిన ప్రచురణ కర్తలను అభినందించితీరాలి. ప్రభుత్వాలు ప్రచురిస్తున్న పుస్తకాలు, నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌లు కూడా సరయిన సమాచారాన్ని అందించడం లేదు. కానీ ఈ పుస్తకం విషయానికి సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తుంది. అందుకే ఇది ఎన్నికల పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ కొని తీరవలసిన ఉత్తమ ఆచూకి సాధనం.

- వేదమాలిక


పెన్నాఅహోబిలం
ఆలయం

విజయనగర వైభవానికి సాక్షీభూతం

రాకెట్ల వీరన్న

అనంతపురం కరువుజిల్లా అయినా శ్రీకృష్ణదేవరాయల పాలనా వైభవానికి దర్పణంగా నిలుస్తుంది. ఇప్పటికీ అనేక కోటలు నాటి వైభవాన్ని కళ్లకు కడతాయి. అదేవిధంగా సత్యసాయిబాబా ఆశ్రమం, ఆయన నిర్మించిన ఆస్పత్రి, విద్యాసంస్థల వల్ల పుట్టపర్తి అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందింది.

పెనుకొండ:

శ్రీకృష్ణదేవ రాయల వేసవి విడిదిగా ప్రసిద్ధి చెందిన పెనుకొండ కోటను క్రియాశక్తి వడయారు కట్టించారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ. 1357లో బుక్కరాయలు తన కుమారుడయిన విరూపణ్ణను పెనుకొండకు రక్షకుడిగా నియమించారు. ఉమ్మత్తూరు గంగరాజు పెనుకొండపై స్వతంత్ర్యం ప్రకటించుకోవడంతో శ్రీకృష్ణదేవ రాయలు గంగరాజును ఓడించి కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఇక్కడ నిర్మించిన ''గగన్‌మహాల్'' పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇక్కడ మహామంత్రి తిమ్మరుసు బందిఖానా, తిమ్మరుసు సమాధి నాటి చరిత్రను చెప్పి కన్నీళ్ళు తెప్పిస్తాయి. కొండలపై గల యోగ నరసింహ దేవాలయం, కొలను ఖిల్లా రహస్య మార్గం, ఉయ్యాలగోపురం, వసురక్కణి, పాలక్కణి అనే పేర్లతో పిలువబడే విశాలమైన బావులు, గగన్‌మహల్ ఇక్కడ ఉన్నాయి. ఈ దుర్గం ప్రాంగణంలో ఆనాడు 365 దేవాలయాలు ఉన్నట్లు ప్రతీతి. కోటకు నాలుగు ముఖ ద్వారాలు ఉన్నాయి. జిల్లావాసులే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా హిందూ-ముస్లింలు లక్షలాది మంది ఇక్కడ జరిగే ఉరుసులో పాల్గొంటారు.

కదిరి:

చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పురాతన వైష్ణవక్షేత్రం. ఇక్కడ వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహం స్వయంభూ అంటారు. భక్త ప్రహ్లాదుని ప్రార్థన మన్నించి శ్రీ మహావిష్ణువు నరసింహ రూపంలో ఇక్కడ ఆవిర్భవించాడని స్థానికుల విశ్వాసం. గర్భగుడి పశ్చిమ చాళుక్యుల కాలంలోనూ, ఆలయాన్ని విజయనగర రాజులు నిర్మించినట్లు శాసనాధారాల వల్ల తెలుస్తోంది.

పెన్న అహోబిలం :

అనంతపురం - ఉరవకొండ మార్గంలో అనంతపురం నుండి 40 కిలోమీటర్ల దూరంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. పచ్చని సెలయేళ్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఆలయానికి వచ్చే యాత్రీకులను, భక్తులను పరవశింపచేస్తుంది.

పుట్టపర్తి:

సత్యసాయి బాబా ప్రశాంతి నిలయం, మ్యూజియం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థలు, నక్షత్రశాల, హిల్ వ్యూ స్టేడియం, చైతన్య జ్యోతి మ్యూజియం, డీమ్డ్ యూనివర్శిటీ దర్శించదగినవి. ఒకప్పుడు చిన్న కుగ్రామంగా ఉన్న పుట్టపర్తి నేడు ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ప్రపంచం నలుమూలల నుండి ఎందరో భక్తులు, యాత్రీకులు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. ఇక్కడ ఉన్న బస్‌స్టేషన్ నుండి దక్షిణ భారతదేశం లోని అన్ని ప్రాంతాలకు బస్సులు వెళతాయి. విమానాశ్రయం, రైల్వేస్టేషన్ సౌకర్యాలున్న పుట్టపర్తి అనంతపురం నుండి 90 కిలోమీటర్ల దూరంలో ఉంది.

రత్నగిరి:

నాటి పాలెగాళ్ల చరిత్రను చాటిచెప్పిన రాజులు మెచ్చిన రత్నగిరి కోట రొళ్ల మండలంలోని రత్నగిరి గ్రామంలో ఉంది. 1746లో మైసూరు రాజ్యాధీశుడు హైదరాలీ ఈ దుర్గాన్ని వశపరచుకున్నాడు. 180 మీటర్ల ఎత్తు నుండి 500 మెట్లతో బలిష్టమైన కోట బురుజులతో రత్నగిరి కోట నిర్మితమయ్యింది. అనంతపురం నుండి 170 కిలోమీటర్లు, హిందూపురం నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఆలూరు కోన :

ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతం ఆలూరు కోన. ఇది తాడిపత్రి పట్టణానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ నిత్యం జలజలపారే జలపాతం, ఎత్తయిన కొండలు, పచ్చని వృక్షాలు, రమణీయ వాతావరణం యాత్రీకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. సమీపంలోని కొండమీద బుక్కరాయలచే క్రీ.శ.1330లో నిర్మించిన శ్రీ రంగనాథస్వామి ఆలయం కూడా చూడవలసిన యాత్రాస్థలం.

వీరాపురం :

సైబీరియా నుండి వలస వచ్చే పక్షులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. సైబీరియా ప్రాంతం నుండి ఇక్కడికి వచ్చే పక్షుల కిలకిలారావాలతో వీరాపురం మారుమోగుతోంది. కొడకొండ-చిలమత్తూరు రహదారి పక్కన ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది వీరాపురం గ్రామం. సైబీరియా ప్రాంతం నుండి ప్రతి ఏటా జనవరిలో ఇక్కడికి వచ్చి ఆరు మాసాలపాటు ఇక్కడ సంచిరించి, జూన్ నెలలో వర్షాలు కురవడం మొదలు కావడంతోనే తిరిగి తమ స్వస్థలానికి పయనమవుతాయి. అనంతపురం నుండి వీరాపురం గ్రామం 135 కిలోమీటర్ల దూరంలో ఉంది. ✦

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్




విదేశీ 'హైకూ'ను స్వదేశీ 'నానీ'గా సృష్టించిన కవి ఆచార్య ఎన్.గోపి. ఆ తర్వాత ఆయన వారసులుగా ఈనాడు ఆంధ్రదేశంలో కొందరు కవులు ముందుకు సాగటం కనిపిస్తుంది. ఈ దిశలో 'నానీ' ప్రక్రియను చేపట్టి తమ కలాల్ని ఝుళిపిస్తున్న గోపి వారసుల్లోని తొలి ముగ్గుర్లో సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఒకరు. 'లోయలో మనిషి' 'చల్లకవ్వం' కవితా సంపుటాలను వెలువరించిన ఈ కవి 'తొలకరి చినుకులు' ద్వారా పాఠకులకు మరింత చేరువయ్యారు. ఇందుకు కారణం ఇది 'నానీ'లతో ఏర్చి కూర్చిన సంపుటి కావడమే! ఈ నేపథ్యంలో పాఠకుల మనస్సులను విశేషంగా ఆకర్షిస్తోన్న 'నానీ'ల గురించి, వాటి విశేషాల గురించి సోమేపల్లి వెంకటసుబ్బయ్యతో జరిపిన ఇంటర్వ్యూ ఇది:

అల్పాక్షరాల్లో అనంతభావాలు... 'నానీ'

సోమేపల్లి

చలపాక ప్రకాష్

✤ "నానీ" ప్రక్రియ గురించి వివరించండి.

నానీ అంటే 'నావి, నీవి వెరసి మనవి' అని ఆ ప్రక్రియ సృష్టికర్త ఆచార్య ఎన్.గోపిగారే చెప్పారు. అంటే నానీలు మనకి ఎంతో ఆత్మీయమైనవి. మన గుండె తలుపులు తట్టే చుట్టాలన్నమాట. ఒక విధంగా చెప్పాలంటే మన తెలుగిళ్లల్లో పిల్లలకి పెట్టే 'ముద్దు' పేరే నాని. 20-25 అక్షరాలతో వుంటుంది. అందులో మొదటి రెండు పాదాలు ఒక భావాంశం (యూనిట్) గాను, చివరి రెండు పాదాలు మరో భావాంశంగాను వుంటాయి. చివరి రెండు పాదాలు మొదటి రెండు పాదాలను సమర్థించేవిగానో, వ్యతిరేకించేవిగానో వుంటాయి లేదా మొత్తం నాలుగుపాదాలు ఒక వస్తువునే వివరించేవిగానైనా వుంటాయి. ఎస్.ఆర్.భల్లం పేర్కొన్నట్టు బుడిబుడి పదాలతో భూగోళమంత భావాన్ని వ్యక్తీకరించే వీలున్న ప్రక్రియ నానీ. హైకూలో కంటే వస్తు విస్తృతికి, అక్షర నియతిలో వెసులుబాటుకి నానీల్లో అవకాశం వుంది.

✤ మీరు గతంలో వచన కవితలు రాశారు, కవితా సంపుటాలు వెలువరించారు కదా... ఈ 'నానీ'లు రాయాలనే తలంపు మీకెలా కలిగింది?

ఒక దినపత్రికలో ప్రచురితమైనప్పుడు గోపిగారి నానీలు గురించి విన్నాను. కాని అప్పుడవి చదవలేదు. కవి మిత్రుడు ఎస్.ఆర్.భల్లం ఒకసారి మాటల సందర్భంలో నానీలు రాస్తున్నట్టు చెప్పారు. అప్పుడు ఆ ప్రక్రియ గురించి పూర్తిగా తెలుసుకున్నాను. తర్వాత గోపిగారి 'నానీలు' పుస్తకం చదివాను. అవి నన్ను ఎంతో ప్రభావితుణ్ణి చేశాయి. నాచేతే 'నానీ'లు రాసే దశకు దారి తీయించాయి. ఆ ప్రేరణతోనే వంద నానీలు రాసి 'తొలకరి చినుకులు' సంపుటి ప్రచురించాను.

✤ వివిధ కవితా ప్రక్రియల స్థాయికి 'నానీ' ప్రక్రియ కూడా చేరుకోగలదంటారా?

ఒక ప్రక్రియ కొంతకాలం బాగా ప్రచలితం కావచ్చు. తర్వాత కొంతకాలం దాని ఉధృతి తగ్గవచ్చు. నానీలు ఇప్పటికే ఒక ప్రక్రియగా స్థిరపడి పాఠకుల అభిమానం పొందాయి. వాటిని నిత్యజీవితంలో అనేకమంది కోట్ చేయడం నానీల ప్రభావాన్ని తెలియచేస్తుంది. డా॥ సి.నారాయణరెడ్డి, నాగభైరవ కోటేశ్వరరావు వంటి ప్రసిద్ధకవులు కూడా నానీలను మెచ్చుకొని ప్రోత్సహిస్తున్నారు. కనుక ఈ ప్రక్రియ తెలుగు సాహిత్యంలో తప్పక స్థిరపడుతుందని నా విశ్వాసం.

✤ పాఠకులు నానీలు చదవడానికి, ఇష్టపడడానికి కారణం ఏమిటంటారు?

అల్పాక్షరాల్లో అనల్పార్థం ఇమిడివున్న ఏ ప్రక్రియ అయినా సమర్థవంతమైనదే అవుతుంది. అయితే అందులో 'సరుకు' లేక పోతే అది ఆదరణ పొందదు కదా... అటువంటి అల్పాక్షరాలలో అనంతమైన భావాన్ని వివరించే ప్రక్రియగా 'నానీ' పాఠకుల అభిమానాన్ని చూరగొంటోంది.

✤ కవిగా పేరు ప్రఖ్యాతులను సంపాదించు కున్నారు కదా... సాహితీ సామ్రాజ్యంలో

నానీల ప్రక్రియలోనే స్థిరపదాలను కుంటున్నారా? లేక ...

మంచి నానీ తట్టినప్పుడల్లా రాస్తూనే వుంటాను. ప్రస్తుతం మరో నానీల సంపుటి వేసే ప్రయత్నంలో వున్నాను. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా నానీలు రాసే కవులందరి నానీలను ఒక సంకలనంగా తెచ్చే ప్రయత్నం కూడా చేస్తున్నాను. వచన కవిత్వం కూడా రాస్తున్నాను. ప్రతిభ వుంటే ప్రక్రియ ఏదైనా పట్టం కట్టాల్సిందే.

❖ **పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ... ఎంతో బిజీగా వుంటూనే ఈ రంగంలో నిలదొక్కుకునే రచనలు ఎలా చేయగలుగుతున్నారు?**

మొదట ఒక దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా పని చేసేవాణ్ణి. అవిధంగా సాహిత్యరంగంతో అనుబంధం ఏర్పడింది. ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగం లభించింది. వృత్తిపరంగాను, దైనందిన జీవితంలోను అనేకమంది వ్యక్తుల్ని కలుస్తుంటాను. పలు సమస్యలు నా దృష్టికొస్తుంటాయి. అప్పుడు నాలోని కవి మేల్కొంటాడు. ఆ సమస్యలే నా కవితా వస్తువులవుతుంటాయి. నా చేత రచనలు చేయిస్తుంటాయి. సమకాలీన సంఘటనలు కూడా నా కవితారచనకు స్ఫూర్తిని కలిగిస్తుంటాయి. ఆచార్య ఎన్.గోపి, సినీకవి రసరాజు, అద్దేపల్లి రామమోహనరావు వంటి ప్రసిద్ధకవుల ప్రోత్సాహం లభించడం, పాఠకులు నా రచనల్ని ఆదరించటం నా కవితాసృజనకు మూలకారణం.

✦

భారత్ కుమిలిపోతోంది

ఆస్తులను అమ్మేసి - అందినంతమేస్తున్న
అపరదేశ భక్తుల - అధ్వాన్నపు పాలనతో
తెహల్కా టేపుల్లో - జుదేవూ జేబుల్లో
శవపేటిక దిగుమతిలో - చెదబట్టిన స్థితి జూసి
వెలిగిపోతుందా ? భారత్ నలిగిపోతుందా ?
కూలీ లేక, కూడు లేక - వలసెల్లిన బతకలేక
కళ్ళముందె కన్నబిడ్డ - కాటికెళ్ళి పోతాడని
కడుపు తీపి చంపుకుని - అమ్ముకునే అనాథలు
అడుగడుగున అగుపించే - ఆకలి కేకలు జూసి
వెలిగిపోతుందా ? భారత్ చితికిపోతుందా ?
ధనిక దేశ దిగుమతులు - దారుణంగా దెబ్బతీసి
పంటకు తగు రేటు లేక - పలకరించె దిక్కులేక
అన్నదాత రైతన్న - వెన్ను విరిగి చస్తుంటే
ఆదుకోండన్నోళ్ళకు - ఆయుధాలు ఎదురయ్యేని
వెలిగిపోతుందా ? భారత్ కుమిలిపోతుందా ?
సామ్రాజ్యవాదులకు - సాష్టాంగ ప్రణామాలు
బహుళజాతి సంస్థలకు - భా.జ.పా. భజనలు
ప్రజాస్వామ్య ఉద్యమాల - పట్టుగొమ్మ దశ నుండి
ప్రపంచాన తన ఖ్యాతి - పలుచనయ్యే దిశ జూసి
వెలిగిపోతుందా ? భారత్ దిగులుపడుతుందా ?
మాన, ప్రాణ రక్షణలు - మంటగలిసి మహిళలు
విష సంస్కృతి పిడికిలిలో - విలపించిన తీరు జూసి
చదువులమ్మ మది నిండా - మతోన్మాద మత్తు
జుట్టుబట్టి చొప్పించిన - ఛాదస్తుల చేష్టలతో
వెలిగిపోతుందా ? భారత్ సిగ్గుపడుతుందా ?
ఫాసిస్టు పరిహారం - పాలనలో జొరబడితే
మోడీలు, కేడీలు - ముఖ్యమంత్రులౌతుంటే
గుజరాతు ఘోరాలు - గుడి పేరుతో దారుణాలు
సామరస్య సౌధాన్ని - తగులబెట్టుతున్నాయని
వెలిగిపోతుందా ? భారత్ వణికిపోతుందా ?
కార్మికుల హక్కులన్ని - కరిగిపోతున్నందున
కోటి ఉద్యోగాల మాట - నీటి మూటైనందున
వాజ్‌పాయి పాలనకు - వంతపాడినోళ్ళంత
ఒక్కొక్కరు వరుసగా - వదిలిపోతున్నందున
వెలుగు కోరిందీ.... భారత్ పరువు కోరిందీ...

- కంకణాల ఆంజనేయులు .

ADVOCATE

న్యాయసలహాలు

ఈ సమస్య నుండి బయటపడేది ఎలా?

నేను పార్ట్ టైమ్ జూనియర్ లెక్చరర్‌గా 13 సంవత్సరాల నుండి పని చేస్తున్నాను. నా సర్వీసును రెగ్యులర్ చేయమని మినిమమ్ పేస్కేల్స్ ఇవ్వమని 1998లో ట్రిబ్యునల్‌కు, తదుపరి ట్రిబ్యునల్ ఆర్డర్స్‌ను అమలు జరపమని హైకోర్టుకు వెళ్ళాను. కోర్టు ఆర్డర్స్‌ను ధిక్కరించినందుకు కంటెమ్ట్‌కు కూడా వెళ్లాను. ఇదిలా వుండగా 2000 డిసెంబర్ నుండి నాకు మినిమమ్ పేస్కేల్స్ ఇస్తున్నారు. దీనిలో మినిమమ్ పేస్కేల్స్ ఎరియర్స్‌కు సంబంధించి ఒక పొరపాటు వుందని మా కాలేజీ ప్రిన్సిపాల్ డైరెక్టర్ గారికి క్లారిఫికేషన్ రాశారు. దీనిపై ఇంతవరకు ఎటువంటి సమాధానం రాలేదు. నేను 2002 నుండి మా అసోసియేషన్ జోన్-1 (విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం) కార్యదర్శిగా ఇంటర్మీడియట్ బోర్డ్‌కు అనేక రిప్రజెంటేషన్స్ పెట్టి వున్నాను. అందులో మాకందరికీ 1992 సంవత్సరం నుండి అవర్లీ బేసిస్‌కు, మినిమమ్ స్కేల్స్‌కు మధ్యగల తేడా జీతాలు ఇవ్వవలసిందిగానూ, టి.టి.డి. దేవస్థానాల కళాశాల వారికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఇస్తున్న మాదిరిగా మా పార్ట్‌టైమర్స్‌కు వేసవి సెలవులలో జీతాలు ఇమ్మని డిమాండ్ చేశాం. అలాగే ఒకేషనల్ కోర్సులలో పని చేస్తున్న పార్ట్ టైమర్స్‌కు ఇస్తున్నట్టుగా నెల మొత్తానికి అనగా 30 దినాలకు జీతాలు ఇవ్వవలసిందని అడిగాము.

ఇదిలా ఉండగా మా అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ అని చెప్పుకుంటున్న ఒక పెద్దమనిషి పైన వేము ఏ డిమాండ్స్ అడిగామో వాటిని ఇంటర్మీడియెట్ డైరెక్టర్ గారు మంజూరు చేశారని చెబుతూ త్వరలో ప్రొసీడింగ్స్ కాలేజీలకు చేరతాయని చెప్పాడు. అయితే ఆ ప్రొసీడింగ్స్ అసలా లేక నకిలీవా అనేది మాకు తెలియదు. కాని ఆ ప్రొసీడింగ్స్ నకిలీవని తెలుపుతూ డైరెక్టరేట్ నుండి మరో ప్రొసీడింగ్స్ వచ్చాయి. పై ప్రొసీడింగ్స్‌తో సంబంధం లేకుండా మా జోన్‌లోని 16 మంది పి.టి.జె.ఎల్స్ వేము ముందు అడిగిన. డిమాండ్స్ కోనం ట్రిబ్యునల్‌కు వెళ్ళాము. 4 వారాల లోగా మా రిప్రజెంటేషన్స్ పరిష్కరించవలసిందిగా కడూ ట్రిబ్యునల్ డైరెక్షన్ ఇచ్చింది. పై 16 మందిలో నేను కూడా ఒకడ్ని.

కాని విచిత్రమేమంటే పైన చెప్పిన నకిలీ ప్రొసీడింగ్స్‌ను నేను ఫర్నిష్ చేశానని, ఆ విధంగా ప్రభుత్వానికి నష్టం చేశానని నాపై జిల్లా ఎస్.పి.గారికి కంప్లయింట్ ఇవ్వమని ప్రిన్స్‌పాల్‌కు ఇన్‌స్ట్రక్ట్ చేస్తూ డైరెక్టర్ గారు ఆదేశించారు.

నేను మొదట చెప్పినట్లుగా నాకు, ఆ ప్రొసీడింగ్స్‌కు ఎటువంటి సంబంధం లేదు. అలాగే ఆ నకిలీ ఆర్డర్స్ ద్వారా ఎటువంటి ఫైనాన్షియల్ బెనిఫిట్ నేను పొందలేదు. ప్రస్తుతం ఉనికిలో వున్న ఆర్డర్స్ ప్రకారం నేను కేవలం పని చేసిన దినాలకు మాత్రమే మినిమమ్ స్కేల్స్ తీసుకుంటున్నాను. నకిలీ ఆర్డర్ అని చెబుతున్న కాగితంపై సంతకాలు చేసిన అధికారులపైగాని, రిఫరెన్స్‌గా ఇచ్చిన ప్రెసిడెంట్, స్టేట్ అసోసియేషన్‌పై గాని ఎటువంటి యాక్షన్ లేదు. ఎటువంటి నోటీసుగాని, ఎంక్వయిరీ గాని లేకుండా నాపై ఇటువంటి చర్యను చేపట్టారు. అయితే అక్టోబర్ 15న కంప్లయింట్ ఇచ్చినప్పటికీ అదృష్టవశాత్తు పోలీసులు ఇంతవరకు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. కొందరు న్యాయవాదులను సంప్రదించగా ఇది ఇమెచ్యూర్డ్ మ్యాటర్ అని అంటున్నారు. కావున నాపై చేపట్టిన ఈ చర్యను ఆపుకునే చట్టపరమైన మార్గాలను తెలుపవలసిందిగా కోరుతున్నాను. ట్రిబ్యునల్ పరిధిలో కాకుండా హైకోర్టు పరిధిలో ఎటువంటి యాక్షన్ తీసుకోవచ్చునో తెలుపవలసిందిగా ప్రార్థన.

- ఎం.అప్పారావు, శ్రీకాకుళం.

మీరు రాసిన సుదీర్ఘ ప్రశ్న అనేక అంశాలతో కూడి ఉంది. దీనికి సమాధానం చెప్పడానికి సంబంధిత ప్రొసీడింగ్స్ లేదా ఆర్డర్స్ పరిశీలించాల్సిన అవసరం ఉంది. నకిలీ ఆర్డర్స్ మీరు గనుక ఇచ్చి ఉండకపోతే అదే విషయాన్ని అధికారులకు తెలియచేయండి. నకిలీ ఆర్డర్స్‌కు కారకులైన సంబంధిత వ్యక్తులపై చర్య తీసుకోమని కోరండి. మీరు తెలిపిన వివరాల ప్రకారం మీపై ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. మీరు ఆ రకమైన నకిలీ ఆర్డర్స్ ఇవ్వకుండా ఉన్నట్లయితే వాటి గురించి ఆందోళన పడక్కర్లేదు. కాబట్టి మీపై ఎటువంటి చర్య లేకుండా ముందుగానే కోర్ట్ నుండి చర్య తీసుకునే అవకాశం లేదు. ఒకవేళ ఏదైనా చర్య తీసుకున్న పక్షంలో కోర్టుకు వెళ్ళవచ్చు. ఒకవేళ క్రిమినల్ కేసు చేపడితే మీకు సమీపంలోని న్యాయవాదిని సంప్రదించి యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నించండి.

- ఎ.సత్యప్రసాద్, హైకోర్టు న్యాయవాది

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం.1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

సుకమడియలు

కావలసిన వస్తువులు:

కందిపప్పు: పావు కిలో

చక్కెర లేదా బెల్లం: పావు కిలో

బియ్యం: పావు కిలో

నూనె: వేయించడానికి తగినంత

యాలుకలు, సోంపు, శొంఠి: 50 గ్రాములు

చేసే విధానం: ఒకరోజు ముందుగానే బియ్యాన్ని నానబెట్టి మరుసటి రోజు పిండిని దంచుకోవాలి. ఈ పిండిని జారుగా కలుపుకోవాలి.

కందిపప్పును ఉడకబెట్టి చక్కెర లేదా బెల్లం వేసి రుబ్బాలి. పూర్ణం పిండి తయారవుతుంది. రుచి, సువాసన కోసం యాలుకలు, సోంపు, శొంఠిని మెత్తగా పొడిచేసి ఆ పూర్ణ ముద్దలో కలపాలి. ఈ పూర్ణం పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకొని జారుగా కలిపిన బియ్యం పిండిలో ముంచి నూనె కాగిన తరువాత అందులో వేయాలి. బంగారు రంగు వచ్చాక వాటిని తీయాలి. వేడివేడిగా నెయ్యి వేసి ఆరగిస్తే చాలా రుచిగా ఉంటాయి. ఇవి వారం రోజుల వరకూ నిల్వ ఉంటాయి. ఈ పూర్ణం బూరెలను మా ప్రాంతంలో సుకమడియలు అంటారు.

– కె.సి. భాగ్యలత, కొడంగల్, మహబూబ్‌నగర్ జిల్లా

సేమియా కేసరి

కావలసిన వస్తువులు:

సేమియాలు: 1 కిలో
పంచదార: ముప్పావు కిలో
నీరు: లీటరున్నర
డాల్డా లేక నెయ్యి: పావు కిలో
యాలకులు: 6
జీడిపప్పు, కిస్‌మిస్: తగినన్ని

తయారుచేయు విధానం:

ముందుగా సేమియాలు కొంచెం డాల్డా లేదా నెయ్యి వేసి ఫ్రై చేయాలి. తర్వాత గిన్నెలో నీరు పోసి కాగిన తర్వాత సేమియాలు వేయాలి. కొంచెం సేపు ఉడికిన తర్వాత చిటికెడు మిఠాయి రంగు, పంచదార వేసి కలపాలి. గట్టిపడే సమయంలోనే మిగిలిన డాల్డా లేదా నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలిపి పొయ్యి మీది నుండి దించాలి.

– ఇ. శేషు కుమారి, హైదరాబాద్



శ్రీమతి సోనియా గాంధి
శ్రీ గులాంనబీ ఆజాద్
శ్రీ డి.శ్రీనివాస్
శ్రీ ఎన్.జనార్ధన్‌రెడ్డి
మాజీ సి.ఎం.
శ్రీ పెద్దిరెడ్డి
రామచంద్రారెడ్డి
శ్రీకాళహస్తి నియోజకవర్గ
ప్రజలకు నా మిత్రులకు
మరియు
శ్రేయోభిలాషులకు
మహాశివరాత్రి
శుభాకాంక్షలు..
ఇట్లు
బియ్యపు మధుసూధన్‌రెడ్డి
కాంగ్రెస్‌పార్టీ నాయకులు
శ్రీ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి
శ్రీ బియ్యపు మధుసూధన్‌రెడ్డి